

పామిడి: ప్రమాదంలో దెబ్బతిన్న బైకు



విలపిస్తున్న సాయి బంధువులు



పామిడి: ప్రమాదంలో చెల్లాచెదురుగా పడివున్న క్షతగాత్రులు

మృత్యు తాండవం

మూడుచోట్ల ప్రమాదాలు

నలుగురు ద్విచక్ర వాహనదారులు బలి

13 మందికి తీవ్ర, ఒకరికి స్వల్ప గాయాలు

- యాడికి ఆస్పత్రిలో కనిపించని వైద్యులు
- ఆగ్రహం వ్యక్తంచేసిన బాధిత కుటుంబాలు
- పామిడి వద్ద జీపు ఢీకొని అన్నదమ్ముల మృతి

యాడికి/పామిడి/ఉరవకొండ, ఆగస్టు 29: రహదారులపై యమ కింకరులు మాటు వేసినట్లున్నారు. ఒకే రోజు నలుగురు ద్విచక్ర వాహనదారులను బలితీసుకున్నారు. పలువురిని తీవ్రంగా గాయపరిచారు. అనంతపురం, నంద్యాల జిల్లాలోని మూడు ప్రాంతాల్లో గురువారం జరిగిన రోడ్డు ప్రమాదాలు బాధిత కుటుంబాలలో అంతులేని విషాదాన్ని నింపాయి. నంద్యాల జిల్లా ప్యాపిలి మండలం వంకమిట్టపల్లి వద్ద రెండు బైకులు ఢీకొని ఒకరు మృతిచెందారు, ముగ్గురు తీవ్రంగా, ఒకరు స్వల్పంగా గాయపడ్డారు. బాధితులు యాడికి మండలం వేములపాడు గ్రామస్థులు. రెండు బైకులు ఢీకొనడంతో చాకలి రాజు(35) మృతిచెందాడు. వేములపాడుకు చెందిన ఓ కుటుంబం అవుకు మండలం కంబగిరిస్వామి ఆలయం వద్ద శుభకార్యాన్ని నిర్వహించింది. ఈ వేడుకకు వెళ్లిన గ్రామస్థులు చాకలి రాజు, సూరి, రాజు, నల్లన్న, ప్రసాద్ రెండు బైకుల మీద తిరిగి వస్తూ.. పరస్పరం ఢీకొన్నారు. చాకలి రాజు అక్కడికక్కడే మృతిచెందగా, సూరి, ప్రసాద్, రాజు తీవ్రంగా గాయపడ్డారు. నల్లన్న స్వల్పంగా గాయపడ్డాడు. బాధితులను ఆటోలో యాడికి ప్రభుత్వ వైద్యశాలకు తీసుకువచ్చారు. అక్కడ వైద్య సిబ్బంది లేకపోవడంతో గంటపాటు వేచి చూసి తాడిపత్రికి తరలించారు. అత్యవసర వైద్యం కోసం వస్తే ఆస్పత్రిలో కనీసం నర్సు కూడా లేకపోవడం ఏమిటని బాధిత కుటుంబ సభ్యులు, వేములపాడు గ్రామస్థులు ఆగ్రహం వ్యక్తం చేశారు. మండలంలో 108 వాహనం కూడా అందుబాటులో లేకపోవడం ఏమిటని ప్రశ్నించారు. ప్రమాదంలో మృతిచెందిన చాకలి రాజు లారీ డ్రైవర్. ఆయనకు భార్య రామాంజినమ్మ, ఇద్దరు కుమారులు, ఒక కూతురు ఉన్నారు. ఇంటి పెద్దదిక్కును కోల్పోయిన భార్య, పిల్లలు కన్నీరు మున్నీరయ్యారు.









చాకలి రాజు (ఫైల్), ప్రమాద ప్రదేశంలో చాకలి రాజు మృతదేహం, తీవ్రంగా గాయపడిన సూరి, రాజు, ప్రసాద్‌ను ఆటోలో తీసుకువచ్చిన దృశ్యం

కోనాపురం వద్ద..



వీరేష్ మృతదేహం

ఉరవకొండ మండల పరిధిలోని కోనాపురం వద్ద ద్విచక్రవాహనం అదుపుతప్పి బోల్తా పడటంతో వీరేష్(26) అనే యువకుడు మృతి చెందాడు. బళ్లారిలోని రాయల్ నగర్‌కు చెందిన వీరేష్, గోవిందరాజు అనంతపురంలో స్నేహితుని వివాహం కోసం ద్విచక్రవాహనంలో బయలు దేరారు. కోనాపురం వద్ద ప్రమాదానికి గురయ్యారు. తీవ్రంగా గాయపడిన ఇద్దరినీ ప్రైవేటు వాహనంలో ఉరవకొండ ప్రభుత్వ ఆసుపత్రికి తరలిస్తుండగా వీరేష్ మృతి చెందాడు. గోవిందరాజుకు ఉరవకొండ ఆస్పత్రిలో ప్రథమ చికిత్స చేయించి.. మెరుగైన వైద్యం కోసం అనంతపురం తరలించారు. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

అన్నదమ్ములు బలి



ప్రమాదస్థలంలో గుమిగూడిన జనం

పామిడి పట్టణంలోని చైతన్య కాలనీ వద్ద బైకును తుఫాన్ వాహనం ఢీకొట్టడంతో అన్నదమ్ములు చిన్నబాబు(28), సాయి(26) మృతిచెందారు. గార్లదిన్నె మండలం కల్లూరుకు చెందిన చాగంటి మోహన్, రామాంజినమ్మ దంపతుల కుమారులు వీరు. ఫొటో స్టూడియో ఏర్పాటు చేసుకుని ఉపాధి పొందుతున్నారు. పామిడిలో ఓ శుభకార్యం కవరేజ్ కోసం బైక్‌లో వస్తుండగా ఎదురుగా వస్తున్న తుఫాన్ వాహనం కుక్కను తప్పించబోయి ఢీకొట్టింది. తీవ్రంగా గాయపడిన ఇద్దరినీ 108లో పామిడి ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతూ ఒకరు పామిడిలో మరొకరు అనంతపురంలో మృతిచెందాడు. తుఫాను వాహనం మధ్యప్రదేశ్ రాష్ట్రానికి చెందినది. డియోరీ జిల్లాకు చెందిన పలువురు కేరళలోని ఇడుక్కి జిల్లాకు కూలి పనులకు ఈ వాహనంలో బయలుదేరారు. బైకును ఢీకొట్టిన తుఫాను వాహనం అదుపు తప్పి రోడ్డు పక్కన బోల్తా పడింది. దీంతో వాహనంలో ఉన్న చమన్, నిర్మల్ సింగ్, అభత్ కుమార్, ఫూల్ చంద్, ప్రేమ్ సింగ్, కిర్రపాల్, అజ్మీర్‌సింగ్, తిలక్, పుష్పేంధర్ గాయపడ్డారు. వీరిని 108, హైవే అంబులెన్స్‌లలో వివిధ ఆసుపత్రులకు తరలించారు. చాగంటి సాయి పామిడి ప్రభుత్వాసుపత్రిలో మృతి చెందగా, చాగంటి చిన్నబాబు అనంతపురం ప్రభుత్వ ఆసుపత్రిలో మృతి చెందారు. మధ్యప్రదేశ్‌కు చెందిన చమన్ పరిస్థితి విషమంగా ఉంది. ప్రమాదానికి కారణమైన కుక్క మృత్యువాత పడింది.



మృతులు చిన్నబాబు, సాయి (ఫైల్)



మృతిచెందిన కుక్క

మిన్నంటిన రోదనలు

అన్నదమ్ముల మృతి విషయం తెలుసుకున్న కల్లూరు వాసులు పామిడి ప్రభుత్వ ఆసుపత్రికి పెద్దఎత్తున తరలివచ్చారు. సాయి మృతదేహాన్ని చూసి కుటుంబ సభ్యులు, బంధువులు బోరున విలపించారు. సాయికి భార్య ప్రశాంతి, కుమారుడు రోహిత్ కుమార్, కూతురు శ్రేష్ఠకుమారి ఉన్నారు. చిన్నబాబుకు భార్య ఉన్నారు. సీఐ రాజశేఖర్‌రెడ్డి ప్రమాద స్థలానికి వెళ్లి వాహనాల రాకపోకలకు ఇబ్బంది కలుగకుండా చర్యలు తీసుకున్నారు.

టీచర్లకు సర్దుబాటు కౌన్సెలింగ్



కౌన్సెలింగ్‌కు హాజరైన ఉపాధ్యాయులు

అనంతపురం విద్య, ఆగస్టు 29: డివిజన్ స్థాయిలో సర్దుబాటు కోసం ఉపాధ్యాయులకు కౌన్సెలింగ్ నిర్వహించారు. జిల్లా కేంద్రంలోని సైన్స్ సెంటర్‌లో డిప్యూటీ డీఈఓలు, ఎంఈఓలు గురువారం ఉదయం నుంచి సాయంత్రం వరకూ కౌన్సెలింగ్ నిర్వహించారు. గుంతకల్లు డివిజన్‌లో 91 మంది మిగులు టీచర్లు ఉండగా, 16 మంది అవసరం ఉంది. అనంతపురం డివిజన్‌లో 31 మంది మిగులు ఉండగా, 30 మంది అవసరమయ్యారు. గుంతకల్లు డివిజన్‌లో 16 స్థానాలకు 16 మంది విల్లింగ్ ఇచ్చారు. అనంతపురం డివిజన్‌లో ఇంగ్లిష్ టీచర్ స్థానానికి కౌన్సెలింగ్ నిర్వహిస్తుండగా ఎస్టీయూ నాయకులు అడ్డుకున్నారు. భాగ్యశ్రీ అనే టీచర్‌ను అనంతపురం మున్సిపాలిటీ నుంచి తాడిపత్రి మున్సిపాలిటీకి సర్దుబాటు చేయగా.. ఆ సంఘం నాయకులు అడ్డుకోవడంతో వాయిదా పడింది. విద్యాశాఖ అధికారులు క్లారిఫికేషన్ కోసం సమస్యను రాష్ట్రస్థాయి అధికారులకు నివేదించారు.

బెస్ట్ టీచర్ అవార్డుకు 42 దరఖాస్తులు

అనంతపురం విద్య, ఆగస్టు 29: జిల్లాస్థాయి ఉత్తమ ఉపాధ్యాయ అవార్డులకు 42 దరఖాస్తులు వచ్చాయి. అనంతపురం డివిజన్‌లో ఎస్జీజీ కేటగిరీ నుంచి 7, స్కూల్ అసిస్టెంట్ల నుంచి 7 దరఖాస్తులు వచ్చాయి. కళ్యాణదుర్గం డివిజన్ నుంచి ఎస్జీటీ కేటగిరీ నుంచి రెండు, స్కూల్ అసిస్టెంట్ కేటగిరీ నుంచి 15 దరఖాస్తులు, ప్రధానోపాధ్యాయుల కేటగిరీ నుంచి ఒకటి వచ్చాయి. గుంతకల్లు డివిజన్ నుంచి ఎస్జీటీ కింద 6, స్కూల్ అసిస్టెంట్ కింద 3, ప్రధానోపాధ్యాయుల నుంచి ఒక దరఖాస్తు వచ్చాయి. మూడు డివిజన్ల నుంచి మొత్తం 42 దరఖాస్తులు వచ్చాయి.

హెచ్‌ఐవీకి అవగాహనే మందు: కలెక్టర్

అనంతపురం టౌన్, ఆగస్టు 29: హెచ్‌ఐవీ, ఎయిడ్స్ నివారణకు అవగాహనే మందు అని కలెక్టరు డాక్టర్ వినోద్ కుమార్ అన్నారు. జిల్లా వైద్య ఆరోగ్యశాఖ ఆధ్వర్యంలో జిల్లా కేంద్రంలో గురువారం 5కె రెడ్ రన్ మారథాన్ నిర్వహించారు. ఆర్ట్స్ కాలేజీ వద్ద ఈ ర్యాలీని కలెక్టర్ ప్రారంభించారు. హెచ్‌ఐవీ, ఎయిడ్స్‌కు చికిత్స లేదని, అవగాహన పెంచుకుంటే ఈ వ్యాధిబారిన పడకుండా ఉండగలమని అన్నారు. హెచ్‌ఐవీ, ఎయిడ్స్ బాధితుల పట్ల వివక్షత చూపరాదని జేసీ శివనారాయణశర్మ అన్నారు. బాధితులకు వైద్యం, మందులను ప్రభుత్వ ఆసుపత్రులలో ఉచితంగా అందిస్తున్నామని తెలిపారు. మారథాన్ విజేతలు నవీన్, రవితేజ, శిరీషా, అశ్రీఫాకు, ట్రాన్స్‌జెండర్ విభాగంలో సత్య, మెహర్‌కు డీఎంహెచ్ఓ డాక్టర్ ఈబీ దేవి బహుమతులను అందజేశారు. కార్యక్రమంలో జిల్లా ఎయిడ్స్ నియంత్రణ విభాగ అధికారి డాక్టర్ అనుపమ జేమ్స్, క్లస్టర్ ప్రోగ్రామ్ మేనేజరు భాస్కర్, డాక్టర్ సుజాత, ప్రిన్సిపాల్ దివాకర్‌రెడ్డి, జిల్లా సూపర్‌వైజర్ జీవీ రమణ తదితరులు పాల్గొన్నారు.



ర్యాలీని ప్రారంభిస్తున్న కలెక్టర్

సోలార్ పార్కుల ఏర్పాటుకు

చర్యలు: కలెక్టర్

కళ్యాణదుర్గం, ఆగస్టు 29: సోలార్ పార్కుల ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలని కలెక్టర్ డాక్టర్ వినోద్‌కుమార్ అధికారులను ఆదేశించారు. కళ్యాణదుర్గం మండలం తిమ్మసముద్రం గ్రామం వద్ద ఏపీఐఐసీ ఆధ్వర్యంలో సోలార్ పార్కు ఏర్పాటు కోసం కేటాయించిన భూములను గురువారం ఆయన పరిశీలించారు. తిమ్మసముద్రం వద్ద 221, 743, 835, 836, 222, 830 తదితర సర్వే నంబర్లలో 1023.63 ఎకరాల భూమిలో సోలార్ పార్క్ ఏర్పాటుకు ప్రతిపాదనలు పంపించామని తెలిపారు. సోలార్ కంపెనీలకు భూములను చూపించాలని ఏపీఐఐసీ అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో ఆర్డీవో రాణి సుష్మిత, ఏపీఐఐసీ జూనియర్ మేనేజర్ సాగర్, తహసీల్దారు భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

క్రీడాకారులను ప్రోత్సహించాలి: కలెక్టర్

అనంతపురం క్లాక్‌టవర్: హాకీ దిగ్గజం మేజర్ ధ్యాన్‌చంద్ స్ఫూర్తితో క్రీడలు, క్రీడాకారులను ప్రతి ఒక్కరూ ప్రోత్సాహించాలని కలెక్టర్ వినోద్‌కుమార్ సూచించారు. ధ్యాన్‌చంద్ జయంతిని పురస్కరించుకుని గురువారం జిల్లా క్రీడాప్రాధికార సంస్థ ఆధ్వర్యంలో జాతీయ క్రీడాదినోత్సవం నిర్వహించారు. ఆర్ట్స్ కళాశాల వద్ద కలెక్టర్ జెండా ఊపి ర్యాలీని ప్రారంభించారు. క్రీడా పోటీల విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు. జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో రాణించిన క్రీడాకారులను సన్మానించారు. డీఎస్‌డీఓ షఫీ, విశ్రాంత డీఎస్‌డీఓ వెంకటరమణ, శిక్షకులు, క్రీడాకారులు పాల్గొన్నారు.

తియ్యని భాష తెలుగు: కలెక్టర్



గిడుగు రామ్మూర్తి, ధ్యాన్‌చంద్ చిత్రపటాలకు నివాళులు అర్పిస్తున్న కలెక్టర్

అనంతపురం టౌన్, ఆగస్టు 29: తెలుగు భాష తియ్యనైనదని కలెక్టరు వినోద్ కుమార్ అన్నారు. కలెక్టరేట్‌లో తెలుగుభాషా దినోత్సవం, క్రీడా దినోత్సవాలను విద్యాశాఖ ఆధ్వర్యంలో గురువారం ఘనంగా నిర్వహించారు. తాను కర్ణాటక నుంచి వచ్చినా.. తెలుగు భాషను నేర్చుకున్నానని కలెక్టర్ అన్నారు. ప్రతి సమావేశంలో తాను తెలుగులోనే మాట్లాడుతున్నానని గుర్తు చేశారు. తెలుగు భాషను రాష్ట్రంలోని ఒక్కో ప్రాంతంలో ఒకలా మాట్లాడుతారని, భాషాభివృద్ధికి కలిసి పనిచేద్దామని పిలుపునిచ్చారు. ఆరోగ్యానికి క్రీడలు అవసరమని, ప్రతి ఒక్కరూ ఆటలు ఆడాలని సూచించారు. కార్యక్రమంలో జడ్పీ చైర్ పర్సన్ గిరిజమ్మ, అసిస్టెంట్ కలెక్టర్ వినూత్న, డీఆర్‌ఓ రామక్రిష్ణారెడ్డి, డీఈఓ వరలక్ష్మి పాల్గొన్నారు.

రేపు పింఛన్ పంపిణీ: కలెక్టర్

అనంతపురం క్లాక్‌టవర్, ఆగస్టు 29: పింఛన్‌దారులకు శనివారం ఇంటి వద్దే పింఛన్ సొమ్ము అందజేస్తామని కలెక్టర్ వినోద్‌కుమార్ తెలిపారు. గురువారం కలెక్టరేట్ మినీకాన్ఫరెన్స్ నుంచి వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ ఇప్పటికే ఆయా గ్రామ, వార్డు సచివాలయాలకు నిధులు విడుదల చేశామని తెలిపారు. కార్యక్రమంలో జేసీ శివ్ నారాయణశర్మ, అసిస్టెంట్ కలెక్టర్ వినూత్న, డీఆర్‌డీఏ-వెలుగు పీడీ ఓబుళమ్మ, ఆర్డీఓలు, ఎల్‌డీఎం, బ్యాంకు అధికారులు, ఎంపీడీలు, మున్సిపల్ కమిషనర్లు, డీపీఓ తదితరులు పాల్గొన్నారు.

జిల్లాలో 2, 86 లక్షల మందికి రూ.125.71కోట్ల నిధులు

జిల్లాలో 2,86,795 మంది పింఛన్‌దారులకు రూ.125.71కోట్లు నిధులు మంజూరు చేశారు. వృద్ధులు 1,42,181 మందికి రూ.56.87కోట్లు, వితంతువులు 66,563 మందికి రూ.26.62కోట్లు, చేనేతలు 6,671 మందికి రూ.2.66కోట్లు, కల్లుగీత కార్మికులు 354 మందికి రూ.14లక్షలు, మత్స్యకారులు 885 మందికి రూ.35లక్షలు, ఒంటరి మహిళలు 6,710 మందికి రూ.2.68కోట్లు, సఫాయి కర్మాచారులు 3,505 మందికి రూ.1.41కోట్లు, హిజ్రాలు 206 మందికి రూ.82వేలు, హెచ్‌ఐవి బాధితులు 2,437 మందికి రూ.రూ.97లక్షలు, డప్పు కళాకారులు 3,117 మందికి రూ.1.24కోట్లు, కళాకారులు 181 మందికి రూ.72వేలు, దివ్యాంగులు 46,184 మందికి రూ.27.71కోట్లు, కుష్టు వ్యాధి బాధితులు 384 మందికి రూ.23లక్షలు, మంచానికే పరిమితమైన బాధితులు 1,438 మందికి రూ.2,15కోట్లు, ప్రమాద బాధితులు 1082 మందికి రూ.1.62కోట్లు, అభయహస్తం 4,232 మందికి రూ.21లక్షలు ఇతరత్ర బాధితులకు కలిపి మొత్తం 2,86,795మందికి రూ.125.71కోట్లు నిధులు విడుదల చేశారు.

అదనపు సీట్లకు దరఖాస్తు చేసుకోండి

అనంతపురం ప్రెస్‌క్లబ్, ఆగస్టు 29: అంబేడ్కర్ గురుకులాల్లో అదనంగా కేటాయించిన 183 సీట్లకు విద్యార్థులు దరఖాస్తులు చేసుకోవాలని గురుకులాల జిల్లా కో-ఆర్డినేటర్ మురళీకృష్ణ గురువారం విడుదల చేసిన ఒక ప్రకటనలో తెలిపారు. కురుగుంట పాఠశాల (బాలికలు)లో 5వ తరగతికి సంబంధించి 10, 6వ తరగతికి 04, 7వ తరగతికి 01, 8వ తరగతికి 05 సీట్లు కేటాయించడం జరిగిందన్నారు. తిమ్మాపురం పాఠశాల (బాలికలు)లో 5వ తరగతికి 10, 6వ తరగతికి 09 సీట్లు, ఉరవకొండ పాఠశాల (బాలికలు)లో 5వ తరగతికి 10, 6వ తరగతికి 05, 8వ తరగతికి 01, గుత్తి పాఠశాల (బాలికలు)లో 5వ తరగతికి 10, 6వ తరగతికి 08, 7వ తరగతికి 06, 8వ తరగతికి 05 సీట్లు కేటాయించారన్నారు. బ్రహ్మసముద్రం పాఠశాల(బాలికలు)లో 5వ తరగతికి 10, 6వ తరగతికి 07, 7వ తరగతికి 02, కొర్రపాడు పాఠశాల(బాలికలు)లో 5వ తరగతికి 10, 6వ తరగతికి 07, 8వ తరగతికి 02 అదనంగా కేటాయించారన్నారు. కణేకల్లు పాఠశాల(బాలురు)లో 5వ తరగతికి 10, 6వ తరగతికి 10, 7వ తరగతికి 05, బి. పప్పూరు పాఠశాల(బాలురు)లో 5వ తరగతికి 10, 6వ తరగతికి 07, 7వ తరగతికి 15, 8వ తరగతికి 04 సీట్లు చొప్పున మొత్తం 183 అదనపు సీట్లు కేటాయించడం జరిగిందన్నారు. అయితే 5వ తరగతికి సంబంధించి ఇదివరకూ జరిగిన బ్రాగ్‌సెట్-2024లోని మెరిట్ ఉన్న విద్యార్థులతో భర్తీ చేయడం జరుగుతుందన్నారు. మిగిలిని 6,7,8 తరగతుల సీట్లకు సంబంధించి ఆయా పాఠశాలల్లో శుక్ర, శనివారాల్లో దరఖాస్తులు అందజేయాలన్నారు. సెప్టెంబరు 1వ తేదీ ఉదయం 11 గంటలకు ఆయా పాఠశాలల్లో ప్రవేశ పరీక్ష నిర్వహిస్తామన్నారు. మెరిట్ సాధించిన విద్యార్థులకు అదనపు సీట్లు భర్తీ చేయడం జరుగుతుందన్నారు. ఇందుకు సంబంధించిన ఖాళీల వివరాలు ఆయా పాఠశాలలు, లేదా డీసీఓ కార్యాలయం నోటీసు బోర్డులలో ప్రదర్శించడం జరిగిందన్నారు.

తాళాలు వేసిన ఇళ్లే టార్గెట్

మూడు ఇళ్లలో చోరీకి దొంగల యత్నం



రత్నమయ్య ఇంట్లో విచారిస్తున్న పోలీసులు

యాడికి, ఆగస్టు 29: వివిధ పనుల నిమిత్తం ఇళ్లకు తాళాలు వేసుకుని ఊర్లకు వెళ్లే వారిని టార్గెట్ చేసుకుని దొంగలు రెచ్చిపోతున్నారు. ఆ ఇళ్లల్లో చోరీకి పాల్పడుతున్నారు. ఇటువంటి సంఘటన బుధవారం రాత్రి యాడికిలో చోటు చేసుకుంది. రామస్వామి కాలనీలోని రెండిళ్లల్లోనూ, కెనరాబ్యాంకు కాలనీలోని ఓ ఇంటిలో దొంగలు చోరీకి ప్రయత్నించారు. చోరీయత్నం జరిగిన మూడు ఇళ్లకు తాళాలు వేసి ఉండటం గమనార్హం. రామస్వామికాలనీలోని రత్నమయ్య ధర్మవరానికి కుటుంబ సభ్యులతో వెళ్లాడు. అదేవిధంగా వెంకటస్వామి అనారోగ్యంతో బాధపడుతూ చికిత్స నిమిత్తం హైదరాబాద్‌కు వెళ్లాడు. కెనరాబ్యాంకు వీధిలో ఉన్న రాముడు అరుణాచలేశ్వరుడి దర్శనానికి వెళ్లాడు. బుధవారం రాత్రి 2 గంటల సమయంలో దొంగలు ఈ మూడిళ్లల్లో చోరీకి ప్రయత్నించారు. తాళాలు పగులగొట్టి ఉండటాన్ని చూసిన స్థానికులు ఇంటివారికి ఫోన్‌చేయడంతో వారి సమీప బంధువులు ఇళ్లను పరిశీలించారు. అయితే విలువైన వస్తువులు చోరీకి గురికాకపోవడంతో యజమానులు ఊపిరిపీల్చుకున్నారు. పోలీసులు ఆయా ఇళ్లను పరిశీలించి స్థానికులతో మాట్లాడారు. అయితే కాలనీవాసులు మాత్రం భయాందోళనలకు గురవుతున్నారు. మూడు ఇళ్లల్లో ఒకేరోజు చోరీకి యత్నించడంపై అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు. రాత్రివేళల్లో పోలీసులు గస్తీ పెంచాలని కోరుతున్నారు.

తాగుబోతుల వీరంగం



గాయపడిన శ్రీరాములు, సంజీవరాయుడు

గుత్తి, ఆగస్టు 29: పట్టణంలోని తాడిపత్రి రోడ్డులో ఓ కల్లు దుకాణం వద్ద గురువారం తాగుబోతులు వీరంగం సృష్టించారు. తాగిన మైకంలో కల్లు దుకాణ యజమాని శ్రీరాములతో గంగరాజు, దేవా తదితరులు గొడవపడ్డారు. రాళ్లు, కర్రలతో దాడి చేశారు. అడ్డుకోబోయిన శ్రీరాములు కూతురు లీలావతి, జనార్దన్‌పై కూడా దాడి చేశారు. సర్దిచెప్పడానికి వెళ్లిన మరో దుకాణదారు సంజీవరాయుడు, మల్లేశ్వరిపైనా దాడి చేసి తీవ్రంగా గాయపరిచారు. గాయపడిన వారిని పోలీసులు స్థానిక ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. శ్రీరాములు, సంజీవరాయుడు పరిస్థితి విషమంగా ఉండటంతో అనంతపురానికి తరలించారు. ఈ గొడవలో గంగరాజు, దేవా కూడా గాయపడ్డారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

విద్యార్థికి తేలు కాటు



చికిత్స పొందుతున్న వన్నూరుస్వామి

బొమ్మనహాళ్, ఆగస్టు 29: పాఠశాలలో తేలు కుట్టి ఓ విద్యార్థి బళ్లారి విమ్స్‌లో చికిత్స పొందుతున్న సంఘటన గురువారం ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. బొమ్మనహాళ్ మండలం ఉంతకల్లు గ్రామంలోని జిల్లా పరిషత్ హైస్కూల్‌లో వన్నూరుస్వామి 9వ తరగతి చదువుతున్నాడు. మంగళవారం ఉదయం పాఠశాల జరుగుతున్న సమయంలో బ్యాగ్గులోని పుస్తకాలు తీస్తుండగా తేలు కుట్టింది. తీవ్ర అస్వస్థతకు గురికావడంతో కుటుంబ సభ్యులు బళ్లారి విమ్స్‌కు తరలించారు. మూడురోజుల నుంచి అక్కడే చికిత్స పొందుతున్నట్లు గ్రామస్థులు తెలిపారు. మూడు రోజులుగా చికిత్స పొందుతున్నా పాఠశాల ఉపాధ్యాయులు పిల్లాడు ఎలా ఉన్నాడని కనీసం వాకబు చేయలేదని తండ్రి దేవప్ప ఆవేదన వ్యక్తం చేశాడు. ఈ విషయంపై ఎంఈఓ మల్లికార్జునను వివరణ కోరగా విద్యార్థికి తేలు కుట్టిన విషయం తెలియదని దీనిపై విచారిస్తామన్నారు.

చేనేతకు పూర్వవైభవం..!

- పట్టువస్త్రాల తయారీకి కూటమి ప్రభుత్వం ప్రోత్సాహం
- మగ్గాలు, పరికరాల పంపిణీకి శ్రీకారం
- వర్క్‌షెడ్ల నిర్మాణాలు, పాత మగ్గాల ఆధునికీకరణకు ప్రణాళిక
- అధికారులతో వరుస సమావేశాలు



క్షేత్రస్థాయిలో చేనేతల వివరాలను పరిశీలిస్తున్న ఏడీఓ మురళీమోహన్ (ఫైల్)



జిల్లా కార్యాలయంలో ఫిర్యాదుల బాక్స్‌ను ఏర్పాటు చేసిన అధికారులు



ముద్ర రుణాల దరఖాస్తులను ఆన్‌లైన్ చేస్తున్న ఏడీఓ శ్రీనివాసులు (ఫైల్)

అనంతపురం సెంట్రల్, ఆగస్టు 29: వ్యవసాయం తరువాత అత్యధికంగా ప్రజలు ఆధారపడ్డ చేనేత రంగానికి పూర్వవైభవం సంతరించుకుంటోంది. పట్టు వస్త్రాల తయారీలో దేశంలోనే ప్రతిభకలిగిన చేనేతలు ఉమ్మడి జిల్లా సొంతం. గత వైసీపీ ప్రభుత్వం ఐదేళ్లలో చేనేత రంగాన్ని నిర్వీర్యం చేయడంతో నేతన్నల ప్రతిభ, జిల్లా ఖ్యాతి మసక బారింది. 2014-19వరకు టీడీపీ ప్రభుత్వం అమలు చేసిన చేనేత పథకాలు, ఆర్థిక ప్రోత్సాహకాలు, రాయితీలను ఎత్తివేసింది. కేంద్ర ప్రభుత్వ నిధులను సైతం పక్కదారి పట్టించింది. ఏడాదికి రూ.24వేలు చెల్లించే నేతన్న నేస్తం పథకాన్ని మాత్రమే అమలు చేసింది. ఈ పథకంలోనూ అర్హులకు అన్యాయంచేస్తూ వైసీపీ కార్యకర్తలు, నాయకులకు రూ.24వేలను కట్టబెట్టింది. వైసీపీ ప్రభుత్వ తీరును ఎండగడుతూ అనేకసార్లు చేనేతలు రోడ్డెక్కి నిరసనలు, ర్యాలీలు చేశారు. తాము అధికారంలోకి వస్తే చేనేత రంగానికి పూర్వవైభవం తీసుకువస్తామని టీడీపీ హామీనిచ్చింది. ఆ మేరకు చేనేత రంగాన్ని ప్రోత్సహించేలా కూటమి ప్రభుత్వం చర్యలు చేపట్టింది.

క్షేత్రస్థాయి పర్యటనలు

చేనేత కార్మికులకు స్థిరమైన ఉపాధిని కల్పించే వస్త్ర తయారీ రంగాన్ని బలోపేతం చేసేదిశగా కూటమి ప్రభుత్వం ప్రోత్సాహకానికి శ్రీకారం చుట్టింది. ఇందులో భాగంగా ప్రాంతాలవారిగా క్లస్టర్లుగా విభజిస్తున్నారు. జిల్లా చేనేత, జౌళిశాఖ అసిస్టెంట్ డైరెక్టర్లు క్షేత్రస్థాయిలో పర్యటిస్తున్నారు. ఒక్కో క్లస్టర్‌లో 300 మందికిపైగా తగ్గకుండా చేనేతలను గుర్తిస్తున్నారు. వారికి నూతన మరమగ్గాలు, పరికరాలు అందజేసేలా వివరాలను క్రోడీకరిస్తున్నారు. స్థానిక వనరులకు అనుగుణంగా వర్క్‌షెడ్లను నిర్మించేందుకు ప్రణాళికలు రూపొందిస్తున్నారు. వీటితోపాటు పాత మగ్గాలను గుర్తించి వాటిని ఆధునికీకరించేందుకు అవసరమైన పరికరాలను అందజేసేందుకు వివరాలను సేకరిస్తున్నారు. రాష్ట్రస్థాయి అధికారులు జిల్లా అధికారులతో ఎప్పటికప్పుడు సమావేశాలు నిర్వహిస్తూ వివరాలను తీసుకుంటున్నారు.

90 శాతం రాయితీ

ఉమ్మడి జిల్లాలో దాదాపు 50వేల మగ్గాలు ఉన్నట్లు అధికార వర్గాలు పేర్కొంటున్నాయి. ఒక్కో కుటుంబంలో ఇద్దరు, ముగ్గురు నేతలు మగ్గం నేస్తున్నారు. అనేక మంది కార్మికులు వర్క్‌షెడ్లలో పనిచేస్తున్నారు. ఇలాంటి వారికి సొంత మగ్గం కలను ప్రభుత్వం నెరవేర్చనుంది. 10 శాతం పెట్టుబడి పెట్టిన నేతలకు 90శాతం రాయితీతో మగ్గాలను అందజేయనున్నారు. అదేవిధంగా శారీరక శ్రమను తగ్గించేందుకు రెండు, మూడు లివర్‌ల లిఫ్టింగ్ మిషన్‌లు, జాకాట్‌లను కూడా 90 శాతం రాయితీతో పంపిణీచేయనుంది. వీటికి అనుగుణంగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల సంయుక్తాధ్వర్యంలో ముద్ర వంటి బ్యాంకు రుణాల పథకాలను కొనసాగిస్తున్నారు. వీటితోపాటు గత టీడీపీ ప్రభుత్వంలో అమలుచేసిన ఉచిత విద్యుత్ సరఫరా పథకాన్ని తిరిగి పునఃప్రారంభించారు.

ఫిర్యాదుల స్వీకరణ...

చేనేత జౌళి శాఖ ఆధ్వర్యంలో అమలు చేస్తున్న పథకాలు, రాయితీలు, ప్రోత్సాహకాలు పారదర్శకంగా అర్హులకు అందించేందుకు కూటమి ప్రభుత్వం ఉపక్రమించింది. మగ్గమే జీవనాధారంగా కుటుంబాన్ని పోషించుకుంటున్న ఏ ఒక్క నేత కార్మికుడు ప్రభుత్వ సంక్షేమానికి దూరం కాకూడదన్న ఉద్దేశంలో ముందుకు సాగుతోంది. పథకాలు అందని వారు ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లేందుకు జిల్లా చేనేత జౌళిఖ కార్యాలయాల్లో ఫిర్యాదుల విభాగాన్ని ఏర్పాటు చేయించింది.

టెక్స్‌టైల్, అపెరల్ పాలసీ

వస్త్ర తయారీని ఆధునికీకరించి ఉత్పాదకతను మెరుగు పరిచేందుకు 2015లో టెక్స్‌టైల్ అపెరల్ పాలసినీ రూపొందించారు. సీఐఐ, ఎఫ్ఏపీఎస్ఐఏ, ఏఎల్ఈఏపి, స్పిన్నింగ్ మిల్స్ అసోసియేషన్స్‌తో సంప్రదించి విధివిధాలను రూపొందించారు. తద్వారా టెక్స్‌టైల్ పరిశ్రమలు, మెగా ప్రాజెక్ట్, అపెరల్ పార్కులు, ఐఐటీల్లో డిజైనింగ్ కోర్సులు, శిక్షణ కేంద్రాలు ట్యూషన్ ఫీజు రీయింబర్స్‌మెంట్ తదితర అంశాలను ఆమోదించారు. డిజైనింగ్ డైయింగ్, ప్రాసెసింగ్, స్పిన్నింగ్, గార్మెంట్, మెషిన్ కార్పెటింగ్, ఎంబ్రాయిడరీ, టెక్నికల్ టెక్స్‌టైల్, క్రింపింగ్, టెక్స్చరైజింగ్, ట్విస్టింగ్, వైండింగ్, సైజింగ్ తదితర వాటికి రాయితీలను అందించారు. వైసీపీ ప్రభుత్వం వాటన్నిటిని ఎత్తివేసి నేరుగా నగదు బదిలీ పేరుతో నేతన్న నేస్తాన్ని తీసుకువచ్చింది. కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడంతో పాలసీనీ సవరించి మరిన్ని సౌకర్యాలను చేర్చి మళ్లీ అమలుచేయనుంది.

ఐఎస్ఓ మార్కు తీసుకువస్తాం

దేశీయ, అంతర్జాతీయ డిమాండ్లకు అనుగుణంగా వస్త్ర తయారీలో నాణ్యతను పెంచి రాష్ట్ర చేనేత రంగానికి ఇంటర్నేషనల్ ఆర్గనైజేషన్ ఫర్ స్టాండర్డ్స్ (ఐఎస్ఓ) మార్క్‌ను తీసుకువస్తాం. ప్రతి నేత పట్టునేయడంలో అత్యంత ప్రతిభను కలిగివున్నాడు. గత వైసీపీ ప్రభుత్వం చేనేత రంగాన్ని నిర్వీర్యం చేసింది. సీఎం చంద్రబాబు నేతృత్వంలో మళ్లీపూర్వ వైభవం తీసుకువచ్చేందుకు చర్యలు చేపట్టాం. క్లస్టర్ల వారిగా చేనేతల సంఖ్యకు అనుగుణంగా 90శాతం రాయితీతో నూతన మగ్గాలు పంపిణీ చేసేందుకు ప్రణాళికలు రూపొందిస్తున్నాం. పాత మగ్గాల ఆధునికీకరణకు కొత్త పరికరాలను అందజేసేలా సర్వే ప్రక్రియను చేపట్టాం.

-సవిత, రాష్ట్ర చేనేత జౌళిశాఖ మంత్రి

గుంతకల్లు డీజిల్ షెడ్.. షష్టిపూర్తి

- వేధిస్తున్న స్పేర్‌పార్ట్స్, పనిముట్ల కొరత
- కార్మికులకు పెనుభారంగా మరమ్మతులు
- ఎలక్ట్రికల్ ట్రాక్షన్ షెడ్డుగా మారే అవకాశం



మరమ్మతుల కోసం వచ్చిన పాత డీజిల్ ఇంజిన్లు

గుంతకల్లు, ఆగస్టు 29: రైల్వే డివిజనల్ కేంద్రంలోని డీజిల్ షెడ్ నేటితో అరవై ఏళ్లు పూర్తి చేసుకుంది. ఇంత ఘనచరిత్ర కలిగిన ఈ డీజిల్ షెడ్‌లో తగిన పనిముట్లు, స్పేర్‌పార్ట్స్ లేవు. పేరుకే ఇది డీజిల్ షెడ్. కాలానికి అనుగుణంగా విద్యుత్ లోకో షెడ్‌గా మారుతోంది. రైల్వేశాఖ ఇంధన ఖర్చులను తగ్గించుకోవడానికి డీజిల్ ఇంజన్ల స్థానంలో విద్యుత్ లోకోలను ప్రవేశపెడుతున్న కారణంగా డీజిల్ ఇంజన్ల సంఖ్య తగిపోయి, విద్యుత్ లోకోల సంఖ్య పెరుగుతూ వస్తోంది. పక్కనే ఎలక్ట్రిక్ ట్రాక్షన్ షెడ్ నిర్మాణంలో ఉన్నందున డీజిల్ షెడ్ తన అస్తిత్వాన్ని కోల్పోయి పూర్తిస్థాయిలో విద్యుత్ షెడ్‌గా రూపాంతరం చెందనుంది. ప్రస్తుతానికి డీజిల్, విద్యుత్ షెడ్లు ఉన్నా రెండింటిలోనూ చాలా పాత ఇంజన్లు ఉండటంతో కార్మికులకు భారంగా పరిణమించింది.

వేధిస్తున్న స్పేర్స్, పనిముట్ల కొరత

అరవైయ్యేళ్ల ఘనమైన పేరున్న గుంతకల్లు రైల్వే డీజల్ షెడ్‌లో పనిచేయడానికి తగిన పనిముట్లు, రైలింజన్లకు అవసరమయ్యే స్పేర్స్ లేక మెకానికల్ సిబ్బంది తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. ఒక ఇంజన్ రిపేరుకు వస్తే దానికి అవసరమయ్యే స్పేర్‌ను ఇంకో ఇంజన్ నుంచి తీసి దానికి తగిలించడం, మరొక ఇంజన్ రిపేరుకు వచ్చినప్పుడు దాని స్పేర్లను మునుపటి ఇంజన్‌కు బిగించి పంపడం చేస్తూ నెట్టుకొస్తున్నారు. గుంతకల్లు డీజల్ షెడ్‌తోపాటు, ఎలెక్ట్రికల్ లోకో షెడ్‌కు అన్నీ పాత ఇంజన్లనే కేటాయించడంతో స్పేర్స్ సమస్యతో సతమతమౌతున్నారు. గుంతకల్లులో నూతనంగా విద్యుత్ లోకోల మరమ్మతు కేంద్రాన్ని ఏర్పాటుచేసినా, దానికి కొత్త లోకోలను ఇవ్వలేదు. స్పేర్స్, టూల్స్ లేక పని డబుల్ అవుతోందని రైల్వే డీజల్ షెడ్ కార్మికులు వాపోతున్నారు. పక్కనే ఉన్న గుత్తి డీజిల్ షెడ్‌కు గత నెలలో కొత్త డీజిల్ లోకోలను ఇచ్చారు. కాగా డీజిల్ వినియోగాన్ని తగ్గించి తద్వారా ఖర్చులు తగ్గించుకోవడానికి రైల్వే శాఖ విద్యుత్ వినియోగాన్ని పెంచే కార్యాచరణను పెంచింది. ఈ మేరకు రైల్వే డివిజన్‌లో వంద శాతం లైన్ల విద్యుద్దీకరణ కూడా పూర్తయింది. ఈ పరిస్థితుల్లో అన్నేసి డీజిల్ ఇంజన్లను కొని గుత్తికి పంపడం ఏంటన్న ప్రశ్నలు తలెత్తుతున్నాయి.

అస్తిత్వాన్ని కోల్పోతున్న డీజిల్ షెడ్డు

గుంతకల్లులోని రైల్వే డీజిల్‌షెడ్ కాలానికి అనుగుణంగా తన అస్తిత్వాన్ని కోల్పోతూ వస్తోంది. కేంద్రం రైల్వేలను వందశాతం విద్యుద్దీకరణ చేయడానికి పదేళ్ల కిందట కార్యాచరణ ప్రారంభించింది. ఈ మేరకు లైన్లను విద్యుద్దీకరించడం, విద్యుత్ లోకోలను ప్రవేశపెట్టడం, తదితర కార్యక్రమాలను చేపట్టింది. ఇందులో భాగంగా గుంతకల్లులో విద్యుత్ లోకోల మరమ్మతుకు ట్రాక్షన్ షెడ్ నిర్మాణం చేపట్టింది. దాని నిర్మాణం పూర్తికాకమునుపే పాక్షికంగా పూర్తయిన షెడ్‌లోనే విద్యుత్ లోకోల మరమ్మతులను చేయడం ప్రారంభించారు. కొందరు టెక్నీషియన్లకు, మెకానిక్‌లకు ప్రత్యేక శిక్షణను ఇచ్చారు. శిక్షణ తీసుకోని కార్మికులు, సాంకేతిక సిబ్బందిచేత డీజిల్ లోకోలను రిపేరిచేయిస్తూ, తర్ఫీదు పొందిన వారి చేత విద్యుత్ లోకోలను మరమ్మతులు చేయిస్తున్నారు. ఈ నేపథ్యంలో డీజిల్ లోకోల సంఖ్యను తగ్గించేసి విద్యుత్ లోకోలను పెంచారు. ఈ కారణంగా ప్రస్తుతం కేవలం 30 డీజిల్ ఇంజన్లు ఇక్కడ ఉండగా, 180 విద్యుత్ లోకోలు వచ్చి చేరాయి. మరి కొన్నేళ్లలో డీజిల్ ఇంజన్లు అంతరించి కేవలం విద్యుత్ లోకోలు మాత్రమే ఇక్కడ మరమ్మతులు చేసే పరిస్థితులు ఏర్పడనున్నాయి. కాగా డీజిల్ షెడ్‌లో తాగునీటి వసతి లేదని, టాయిలెట్లు లేవని, మహిళా ఉద్యోగులకు విశ్రాంతి గది వసతిని ఏర్పాటు చేయలేదని సిబ్బంది విమర్శిస్తున్నారు. ఈనెల 30వ తేదీకి డీజిల్ షెడ్ ఏర్పాటై 60 ఏళ్లు కానుంది. ఈ షెడ్ ఇక ఎన్నేళ్లు కొనసాగుతుందో తెలియని పరిస్థితులు ఉన్నాయి. సమీప భవిష్యత్తులో దీన్ని పూర్తిగా ఎలక్ట్రికల్ ట్రాక్షన్ షెడ్‌గా మార్చే అవకాశాలున్నాయి.

అంతర్జాతీయ ప్రమాణాలతో దులీప్ ట్రోఫీ

- అదేస్థాయిలో భద్రత, సదుపాయాల కల్పన
- సెప్టెంబరు 5 నుంచి 22 వరకు పోటీలు
- దేశంలోని టాప్ క్రికెటర్ల రాక
- ఆంధ్రా క్రికెట్ అసోసియేషన్ త్రీమెన్ కమిటీ సభ్యుడు మాంచోఫెర్రర్




మాట్లాడుతున్న మాంచోఫెర్రర్

అనంతపురం క్లాక్‌టవర్, ఆగస్టు 29: దులీప్ ట్రోఫీని అంతర్జాతీయ ప్రమాణాలతో అనంతపురం క్రికెట్ గ్రౌండ్ (ఏసీజీ)లో నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నట్లు ఆంధ్ర క్రికెట్ అసోసియేషన్ త్రీమెన్ కమిటీ సభ్యులు, ఆర్డీటీ ప్రోగాం డైరెక్టర్ మాంచో ఫెర్రర్ తెలిపారు. జిల్లా క్రికెట్ చరిత్రలో నిలిచిపోయేవిధంగా నిర్వహణ ఉంటుందన్నారు. గురువారం స్థానిక అనంత క్రీడాగ్రామంలోని ఆడిటోరియంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. జిల్లాలో ఎన్నడూ లేని విధంగా క్రికెట్ పండుగ జరగబోతోందని, క్రికెట్ ప్రేమికులకు ఇదొక అరుదైన అనుభూతినిచ్చే వేడుక అని అన్నారు. పెద్దపెద్ద నగరాలు ఫైవ్ స్టార్, సెవెన్ స్టార్ హోటల్స్, విలాసవంతమైన సదుపాయాలు ఉండే ప్రాంతాల్లో దులీప్ ట్రోఫీని నిర్వహిస్తారని, అటువంటిది జిల్లాకు కేటాయించడం గర్వకారణమన్నారు. దేశంలోని టాప్ క్రికెట్ ప్లేయర్లు జిల్లాకు వచ్చి క్రికెట్ ఆడుతారని, జిల్లాకు గొప్పగొప్ప అవకాశాలు వస్తాయనేందుకు ఇదొక సంకేతమని చెప్పారు. ఇంటర్నేషనల్ పోటీల తరువాత జాతీయ క్రీడాకారులకు అత్యంత ప్రధానమైనది దులీప్‌ట్రోఫీ అని అన్నారు. ఈ ట్రోఫీలో ప్రదర్శన ఆధారంగానే బీసీసీఐ ఇండియా క్రికెట్ జట్టును ఎంపిక చేస్తుందన్నారు. పోటీలకు ఇండియా సెలెక్టర్లు, కామెంటేటర్లు హాజరవుతారన్నారు. స్టార్‌స్పోర్ట్స్, జియో చానళ్లల్లో లైవ్ టెలికాస్ట్ ఉంటుందని, ఇందుకు అనుగుణంగా భద్రతా చర్యలు, సదుపాయాలు కల్పిస్తామన్నారు. రోజుకు కేవలం 4వేల మందికి మాత్రమే పాసులు జారీ చేస్తామని, పాసులు లేకపోతే లోపలికి అనుమతించేది లేదని స్పష్టం చేశారు. మ్యాచ్‌రోజు ఉదయం 8.30గంటల నుంచి ఉదయం 10.30గంటల వరకు మాత్రమే పాసులు ఉన్నవారికి అనుమతి ఉంటుందన్నారు. మొదటి మ్యాచ్ ఇండియాసి-ఇండియా డి జట్ల మధ్య సెప్టెంబరు 5వ తేదీ నుంచి 8వ తేదీ వరకు, రెండో మ్యాచ్ ఇండియాఏ-ఇండియా డి జట్ల మధ్య సెప్టెంబరు 12 నుంచి 15 వరకు, మూడో మ్యాచ్ ఇండియా బి-ఇండియా సి జట్ల మధ్య సెప్టెంబరు 12 నుంచి 15వ తేదీ వరకు బీ గ్రౌండ్‌లో, నాలుగో మ్యాచ్ ఇండియా ఏ-ఇండియా సి జట్ల మధ్య సెప్టెంబరు 19 వతేదీ నుంచి 22వ తేదీ వరకు, ఐదో మ్యాచ్ ఇండియా బి-ఇండియా డి జట్ల మధ్య సెప్టెంబరు 19వ తేదీ నుంచి 22వ తేదీ వరకు బీ గ్రౌండ్‌లో నిర్వహిస్తారని తెలిపారు. సెప్టెంబరు 2వ తేదీన ప్లేయర్లు అనంతకు చేరుకుంటారన్నారు. 3, 4వ తేదీలలో ఏసీజీలో ప్రాక్టీస్ సెషన్‌లో పాల్గొంటారన్నారు. కార్యక్రమంలో దులీప్‌ట్రోఫీ ఆర్గనైజింగ్ కమిటీ కార్యదర్శి షాబుద్దీన్, క్రికెట్ సంఘం జిల్లా కార్యదర్శి మధు ఆచారి, కమిటీ సభ్యులు వగడాల మల్లికార్జున, జొన్నా జయప్రకాష్, ఆదిత్య తదితరులు పాల్గొన్నారు.

డాక్టర్ కృష్ణవేణిపై విచారణ

అనంతపురం టౌన్, ఆగస్టు 29: డీసీహెచ్ఎస్‌గా గతంలో పనిచేసిన డాక్టర్ కృష్ణవేణి ఎదుర్కొంటున్న ఆరోపణలపై విచారణ అధికారి, మచిలీపట్నం డీసీహెచ్ఎస్ డాక్టర్ శ్రావణ్‌కుమార్ గురువారం విచారణ చేపట్టారు. డాక్టర్ కృష్ణవేణి ఉద్యోగ నియామకాలలో అవకతవకలకు పాల్పడ్డారని, నిబంధనలకు విరుద్ధంగా డెప్యుటేషన్లు, వర్క్ ఆర్డర్లు ఇచ్చారని ఆరోపణలు ఉన్నాయి. ఒక ఉద్యోగికి హిందూపురం, అనంతపురం కార్యాలయాలలో రెండుచోట్ల జీతాలు చెల్లించారని, కారు పర్మిషన్, అద్దె కారు విషయంలోను నిబంధనలు పాటించలేదని వైద్య ఆరోగ్యశాఖ రాష్ట్ర కమిషనర్‌కు ఫిర్యాదులు వెళ్లాయి. ఆమె ఉద్యోగోన్నతి కూడా నిబంధనలకు విరుద్ధంగా పొందారని కూడా ఫిర్యాదులు వెళ్లాయి. విచారణ అధికారి డీసీహెచ్ఎస్ డాక్టర్ రవికుమార్ ద్వారా ఫైళ్లను తెప్పించుకుని పరిశీలించారు. ఆరోపణలు ఎదుర్కొంటున్నవారిని ప్రశ్నించి, వివరాలు నమోదు చేసుకున్నారు. డాక్టర్ కృష్ణవేణిపై ఏసీబీకి కూడా ఫిర్యాదులు వెళ్లాయని, ఇటీవల ఏసీబీ అధికారులు డీసీహెచ్ఎస్ కార్యాలయంలో విచారించారని సమాచారం. డాక్టర్ కృష్ణవేణి ప్రస్తుతం తాడిపత్రి ఏరియా ఆస్పత్రికి సూపరింటెండెంట్‌గా కొనసాగుతున్నారు.

భార్య మృతి.. తట్టుకోలేక భర్త కూడా..



పంపాపతి, గంగమ్మ (ఫైల్ ఫొటోలు)

డీ.హీరేహాళ్, ఆగస్టు 29: కట్టుకున్న భార్య అనారోగ్యంతో మృతి చెందడాన్ని జీర్ణించుకోలేక భర్త గుండెపోటుతో మృతిచెందాడు. మండలంలోని నల్లదిబ్బ గ్రామానికి చెందిన గొల్ల పంపాపతి(65), భార్య శివ గంగమ్మ(58) వ్యవసాయ కూలీగా జీవనం కొనసాగించేవారు. వీరికి కూతురు, ఇద్దరు కుమారులు ఉన్నారు. వారం క్రితం శివగంగమ్మకు జ్వరం రావడంతో బళ్లారిలోని ఓ ఆస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతూ ఆమె గురువారం మధ్యాహ్నం చనిపోయింది. ఆమెకు తోడుగా ఆసుపత్రిలో ఉన్న భర్త పంపాపతి.. భార్య చనిపోగానే తీవ్ర ఆవేదనకు లోనయ్యాడు. భార్య ఇక లేదన్న విషయాన్ని జీర్ణించుకోలేక గుండెపోటుతో ఆసుపత్రిలోనే కుప్పకూలిపోయాడు. వెంటనే వైద్యులు పరీక్షించారు. అప్పటికే మృతిచెందినట్లు నిర్ధారించారు. తల్లిదండ్రులు మృతి చెందడంతో ముగ్గురు పిల్లలు దిక్కులేనివారయ్యారు. వీరి పెద్ద కుమారుడు విభిన్న ప్రతిభావంతుడు.

బీటెక్ కోర్సులకు స్పాట్ అడ్మిషన్లు

అనంతపురం సెంట్రల్, ఆగస్టు 29: బీటెక్ ఇంజనీరింగ్ కోర్సులకు స్పాట్ అడ్మిషన్లు చేపట్టినట్లు ఎస్కేయూ ఇంజనీరింగ్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ రామచంద్ర గురువారం ప్రకటనలో తెలిపారు. ఈఏపీసెట్ అర్హత సాధించిన విద్యార్థులకు కన్వీనర్ కోటాలో సీట్లను కేటాయించడం జరిగిందన్నారు. మిగిలిన సీట్లను భర్తీచేసేందుకు 31న స్పాట్ అడ్మిషన్లు నిర్వహిస్తున్నామని తెలిపారు. మరిన్ని వివరాలకు 9492473714 నెంబర్‌ను సంప్రదించాలని కోరారు.

ఫీజు గడువు పొడిగింపు

అనంతపురం సెంట్రల్: ఎస్కేయూ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న డిగ్రీ మెగా సప్లిమెంటరీ పరీక్షలకు సంబంధించి ఫీజు చెల్లింపు గడువును పెంచినట్లు పరీక్షల నిర్వహణ విభాగాధిపతి ప్రొఫెసర్ జీవీ రమణ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. 31వ తేదీ వరకు వున్న గడువును సెప్టెంబరు 18వ తేదీ వరకు పెంచడం జరిగిందన్నారు. అవకాశాన్ని విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

జీడిపల్లికి 931 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో

బెళుగుప్ప, ఆగస్టు 29: మండలంలోని జీడిపల్లి రిజర్వాయర్‌కు బుధవారం 931 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో చేరుతున్నట్లు హంద్రీనీవా అధికారులు తెలిపారు. రిజర్వాయర్‌లో 1.551 టీఎంసీల నీటి నిల్వ ఉన్నట్లు వెల్లడించారు.

దరఖాస్తుల ఆహ్వానం

అనంతపురం విద్య, ఆగస్టు 29: అనంతపురం న్యూటౌన్ ఒకేషనల్ జూనియర్ కళాశాలలో గెస్ట్ లెక్చరర్ పోస్టుల్లో పనిచేయడానికి అర్హులు దరఖాస్తు చేసుకోవాలని ప్రిన్సిపాల్ గురుప్రసాద్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. మల్టీపర్పస్ హెల్త్ అసిస్టెంట్ (ఎంపీహెచ్‌డబ్ల్యూ) ఫీమేల్, లైవ్ స్టాక్ మేనేజ్‌మెంట్ అండ్ డైరీయింగ్ (ఎల్‌ఎం అండ్ డి), సివిల్ ఇంజనీరింగ్ టెక్నీషియన్ (సీ.ఈ.టీ) సబ్జెక్టులు బోధించేందుకు గెస్ట్ లెక్చరర్లు దరఖాస్తు చేసుకోవాలన్నారు. ఎంపీహెచ్‌డబ్ల్యూ కోర్సులకు బీఎస్సీ నర్సింగ్, ఎల్‌ఎం అండ్ డి కోర్సుకు బ్యాచిలర్ ఆఫర్ వెటర్నరీ సైన్స్, సీఈటీ కోర్సుకు బీటెక్ పూర్తి చేసిన వారు అర్హులన్నారు. శుక్రవారం సాయంత్రంలోగా దరఖాస్తులు అందజేయాలని సూచించారు. 31వ తేదీ మధ్యాహ్నం 11 గంటలకు ఇంటర్వ్యూ ఉంటుందన్నారు. అభ్యర్థులు తమ ఒరిజినల్, జిరాక్స్ సర్టిఫికెట్లు తీసుకురావాలన్నారు.

ఎంటెక్, ఎంబీఏ ఫలితాలు విడుదల

అనంతపురం సెంట్రల్, ఆగస్టు 29: జేఎన్‌టీయూ ఆధ్వర్యంలో నిర్వహించిన ఎంటెక్, ఎంబీఏ పరీక్షా ఫలితాలను గురువారం డైరెక్టర్ ఎవాల్యుయేషన్ ప్రొఫెసర్ నాగప్రసాద్ నాయుడు విడుదలచేశారు. ఫలితాలకోసం www.jntua-results.in వెబ్‌సైట్‌ను సందర్శించాలని సూచించారు. కార్యక్రమంలో సీఈ శివకుమార్, ఏసీఈలు అంకారావు, శ్రీధర్ పాల్గొన్నారు.

చీనీ కాయలు టన్ను రూ.23 వేలు

అనంతపురం రూరల్, ఆగస్టు 29: అనంతపురం వ్యవసాయ మార్కెట్‌లో గురువారం చీనీకాయలు టన్ను గరిష్ఠంగా రూ.23వేలు, కనిష్ఠంగా రూ.10వేలు, సరాసరి రూ.15వేలతో అమ్ముడుపోయినట్లు మార్కెట్ ఎంపిక శ్రేణికార్యదర్శి జయలక్ష్మి తెలిపారు. మార్కెట్‌కు మొత్తంగా 146 టన్నుల చీనీకాయలు వచ్చాయన్నారు.

టమోటా కిలో రూ.20

అనంతపురం రూరల్: కక్కలపల్లి టమోటా మార్కెట్‌లో కిలో టమోటా గరిష్ఠంగా రూ.20తో అమ్ముడుపోయినట్లు రాప్తాడు మార్కెట్ యార్డు కార్యదర్శి రాంప్రసాద్ తెలిపారు. గురువారం 2650 టన్నుల టమోటా దిగుబడులు వచ్చాయన్నారు. కిలో సరాసరి ధర రూ.13, కనిష్ఠ ధర రూ.6పలికినట్లు ఆయన తెలిపారు.

హరికృష్ణకు ఘన నివాళి



హరికృష్ణ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే పరిటాల సునీత

రామగిరి, ఆగస్టు 29: టీడీపీ మాజీ పొలిట్‌బ్యూరో సభ్యుడు, సినీనటుడు నందమూరి హరికృష్ణ వర్ధంతిని గురువారం వెంకటాపురం గ్రామంలో నిర్వహించారు. హరికృష్ణ చిత్రపటానికి ఎమ్మెల్యే పరిటాల సునీత పూలమాల వేసి నివాళులర్పించారు. 1983లో ఎన్టీ రామారావు తెలుగుదేశం పార్టీ స్థాపించి ప్రజాచైతన్య యాత్ర చేపట్టిన సమయంలో చైతన్యరథసారధిగా హరికృష్ణ దిగ్విజయంగా ముందుకు నడిపించారని గుర్తుకు చేశారు. నివాళులర్పించిన వారిలో మాజీ జడ్పీటీసీ రామ్మూర్తినాయుడు, నాయకులు బాలాజీ, పరంధామయాదవ్ ఉన్నారు.

పరిటాల రవీంద్ర జయంతికి తరలిరండి

ధర్మవరంరూరల్(కనగానపల్లి): మాజీ మంత్రి పరిటాలరవీంద్ర జయంతికి తరలిరావాలని టీడీపీ మండలకన్వీనర్ యాతంపోతలయ్య గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. స్థానిక పార్టీ కార్యాలయంలో శుక్రవారం జయంతి కార్యక్రమం జరుపుతామని ఈ కార్యక్రమానికి టీడీపీ నాయకులు, కార్యకర్తలు తరలిరావాలని ఆయన పిలుపునిచ్చారు.

యువ కవి అశోక్‌కు గిడుగు రామ్మూర్తి పురస్కారం

అనంతపురంరూరల్, ఆగస్టు 29: మండలంలోని రాజీవ్‌కాలనీకి చెందిన యువ కవి అశోక్ గిడుగు వెంకట రామ్మూర్తి అవార్డు అందుకున్నారు. గురువారం తెలుగు భాష దినోత్సవాన్ని పురస్కరించుకుని సత్యసాయి జిల్లా ధర్మవరంలోని శ్రీభారతి ఆంగ్లమాధ్యమ పాఠశాలలో తెలుగు భాష దినోత్సవాన్ని నిర్వహించారు. శ్రీశ్రీ కళావేదిక సభ్యులు అవార్డును ఆయనకు ప్రదానం చేశారు. కళావేదిక ఛైర్మన్ కత్తిమండ ప్రతాప్, యువజన విభాగం జాతీయ అధ్యక్షుడు సుధాకర్, సభ్యులు అనిల్, శ్రీనివాసులు, అమరనాథ్, పాఠశాల ఛైర్మన్ రాధాకృష్ణ పాల్గొన్నారు.

ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి సంరక్షించాలి

గార్లదిన్నె, ఆగస్టు 29: ప్రతి ఒక్కరూ ఒక మొక్క నాటి సంరక్షించాలని దక్షిణ వ్యవసాయ యంత్రాల శిక్షణ, పరీక్షణ సంస్థ (ట్రాక్టర్ నగర్) డైరెక్టర్ డాక్టర్ నాందేడ్ పేర్కొన్నారు. గురువారం గార్లదిన్నె సమీపంలోని వ్యవసాయ యంత్రాల శిక్షణ, పరీక్షణ సంస్థలో ఆయన ఆధ్వర్యంలో మొక్కలు నాటే కార్యక్రమం చేపట్టారు. కార్యక్రమంలో ట్రాక్టర్ నగర్ సిబ్బంది పాల్గొన్నారు.

ముగిసిన పాఠశాల కమిటీ ఎన్నికలు

నార్పల,ఆగస్టు29: మండల కేంద్రంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాల, బాలికల ఉన్నత పాఠశాలలకు చెందిన పాఠశాల నిర్వహణ కమిటీ ఛైర్మన్‌ల ఎన్నికలు గురువారం ప్రశాంతంగా ముగిశాయి. గతంలో రెండుసార్లు తగిన కోరం లేక వాయిదా పడ్డ ఎస్ఎంసీ ఎన్నికలు ఏకగ్రీవం అయ్యాయి. ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాల ఛైర్మన్‌గా ఆలమూరుప్రసాద్, వైస్‌ఛైర్‌పర్సన్‌గా సునీత ఎన్నికయ్యారు. ప్రభుత్వ బాలికల పాఠశాల కమిటీ ఛైర్మన్‌గా ప్రకాష్ నాయుడు, వైస్‌ఛైర్‌పర్సన్‌గా అనసూయ ఎన్నికయ్యారు. పాఠశాల నిర్వహణ కమిటీ సభ్యుల చేత ప్రధానోపాధ్యాయులు రవి, నగేష్ ప్రమాణ స్వీకారం చేయించారు. టీడీపీ నాయకులు ఆలం వెంకటనరసానాయుడు, ఆకుల ఆంజనేయులు, ఆకుల ప్రసాద్, ఆకుల నాగార్జున, ఆకుల బాబు పాల్గొన్నారు.

ఎరువుల దుకాణంలో తనిఖీ

అనంతపురం అర్బన్, ఆగస్టు 29: నగరంలోని విస్టా అగ్రి గ్రీన్ ప్రైవేటు లిమిటెడ్ దుకాణంలో అనంతపురం ఏడీఏ రవి, ఏఓ శశికళ గురువారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. అక్కడ నిల్వచేసిన ఎరువులు, రికార్డులను పరిశీలించారు. సరైన రికార్డులు లేకపోవడంతో రూ.15 లక్షల విలువైన 18.02 మెట్రిక్ టన్నుల నీటిలో కరిగే ఎరువుల అమ్మకాలు నిలిపివేశారు. అందుకు సంబంధించిన రికార్డులు సమర్పించకపోతే ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు తదుపరి చర్యలు చేపడతామన్నారు. ఎరువులు, పురుగుమందులు, విత్తన దుకాణాల్లో నిబంధనలు తప్పనిసరిగా పాటించాలని ఏడీఏ ఆదేశించారు. నిబంధనలు ఎవరు అతిక్రమించినా చర్యలు తప్పవని హెచ్చరించారు.

నగర కమిషనర్‌గా నాగరాజు

అనంతపురం క్రైం,ఆగస్టు 29: అనంతపురం నగరపాలిక కమిషనర్‌గా జి.నాగరాజును నియమించారు. విశాఖపట్నం మున్సిపల్ ఆర్డీగా విధులు నిర్వర్తిస్తున్న నాగరాజును ఇక్కడకు బదిలీ చేశారు. నాగరాజు ఇదివరకు అనంతపురంలోనే మున్సిపల్ ఆర్డీగా పనిచేశారు. నగర కమిషనర్ మేఘస్వరూప్ తాజాగా బదిలీ అయ్యారు. అప్పటి నుంచి మున్సిపల్ ఆర్డీ వీవీఎస్ మూర్తి ఇన్‌చార్జ్ కమిషనర్‌గా కొనసాగుతున్నారు. కార్పొరేషన్ అడిషనల్ కమిషనర్ శ్రీహరిబాబును చిలకలూరి పేట కమిషనర్‌గా బదిలీ చేశారు. ఆయన స్థానంలో ఇంకా ఎవరినీ నియమించలేదు.

యువకుడి ఆత్మహత్య

అనంతపురం క్రైం,ఆగస్టు 29: వ్యాపారం విషయంలో నష్టం రావడంతో వాటిని తీర్చేమార్గం కనిపించక ఓ యువకుడు ఆత్మహత్య చేసుకున్నాడు. అనంతపురం రూరల్ మండలం కురుగుంట వైఎస్ఆర్‌కాలనీకి చెందిన సూర్యవంశం ఆనంద్‌కుమార్(29) కళ్యాణదుర్గం రోడ్డులో అయ్యప్ప కమ్యూనికేషన్ పేరుతో డీటీహెచ్ సర్వీస్ నిర్వహించేవాడు. ఈ క్రమంలో నష్టం రావడం, ఇతరత్రా పనులతో రూ.10లక్షల వరకు అప్పు చేశాడు. ఫైనాన్స్ తీసుకున్న ఇతను రోజూ రూ.4400 చెల్లించేవాడు. అప్పులు ఎక్కువ కావడం, ఒత్తిళ్లు అధికం కావడంతో బుధవారం ఆయన నిర్వహిస్తున్న షాపు వెనుకనున్న గదిలో విషద్రావకం తాగాడు. కొంత ఆలస్యంగా అక్కడ పనిచేస్తున్న సిబ్బంది గమనించి ఆసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ గురువారం మృతి చెందాడు.

చికిత్స పొందుతూ వృద్ధురాలి మృతి

రాప్తాడు, ఆగస్టు 29: రోడ్డు ప్రమాదంలో గాయపడిన వృద్ధురాలు గంజి యల్లమ్మ (63) చికిత్స పొందుతూ గురువారం మృతి చెందింది. రాప్తాడు మండల కేంద్రానికి చెందిన గంజి యల్లమ్మ, ఇటుక నల్లప్ప దంపతులు బుధవారం ద్విచక్రవాహనంలో రాప్తాడు వద్ద 44వ జాతీయ రహదారి డివైడర్ దాటుతుండగా కారు ఢీకొంది. ఈ ప్రమాదంలో ఇద్దరూ తీవ్రంగా గాయపడ్డారు. చికిత్స నిమిత్తం అనంతపురం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా గంజి యల్లమ్మ పరిస్థితి విషమంగా ఉండటంతో మెరుగైన చికిత్స నిమిత్తం ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ ఆమె మృతి చెందినట్లు రాప్తాడు పోలీసులు తెలిపారు. ఘటనపై కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

తెలుగు భాషోద్యమ పితామహుడు గిడుగు

వ్యవహారిక భాషోద్యమ పితామహుడు గిడుగు రామ్మూర్తి పంతులు అని వక్తలు అన్నారు. ఆయన జయంతిని గురువారం ఘనంగా నిర్వహించారు. ఎస్కేయూ, జేఎన్‌టీయూ, సెంట్రల్ యూనివర్సిటీ వీసీలు.. ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి, ఘన నివాళి అర్పించారు. తెలుగు భాషకు ఆయన చేసిన సేవలను కొనియాడారు. నగరంలోని పలు కళాశాలలు, పాఠశాలలు, గ్రంథాలయంలో గిడుగు జయంతిని ఘనంగా నిర్వహించారు. ఎస్ఎస్‌బీఎన్ కళాశాల, తెలుగుభాష పరిరక్షణ సమితి నాయకులు నగరంలో ర్యాలీ నిర్వహించారు. తెలుగు తల్లి విగ్రహానికి పూలమాలలు వేశారు.

- న్యూస్ నెట్‌వర్క్



జేఎన్‌టీయూలో గిడుగు రామ్మూర్తి చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న అధికారులు



ఎస్ఎస్‌బీఎన్ కళాశాల విద్యార్థుల ర్యాలీ



ఎస్కేయూ తెలుగు తులనాత్మక సాహిత్యశాఖ ఆధ్వర్యంలో...



తెలుగు భాషా సంరక్షణ సమితి నాయకులు



నవభారత్ స్కూల్‌లో...



ఎస్ఎస్ డిగ్రీ కళాశాల విద్యార్థులకు బహుమతుల ప్రదానం



సెయింట్ ఆన్స్‌లో విద్యార్థులకు బహుమతుల ప్రదానం



జిల్లా గ్రంథాలయంలో...



శ్రీచైతన్యలో...



విశాలాంధ్ర బుక్‌హౌస్ ఆధ్వర్యంలో...

అనంతకు అండర్ డ్రైనేజీని మంజూరు చేయండి

● సీఎం చంద్రబాబుకు ఎమ్మెల్యే దగ్గుపాటి వినతి

అనంతపురం అర్బన్, ఆగస్టు 29: అనంతపురం నగరానికి అండర్ డ్రైనేజీని మంజూరు చేయాలని ఎమ్మెల్యే దగ్గుపాటి వెంకటేశ్వరప్రసాద్ సీఎం చంద్రబాబునాయుడుకు విజ్ఞప్తి చేశారు. బుధవారం రాత్రి సీఎంను ఎమ్మెల్యే కలిశారు. నగరంలో నడిమి, వరువ వంకల సమస్యలతోపాటు రోడ్లు, డ్రైనేజీలు, తాగునీటి సమస్యను సీఎం దృష్టికి తీసుకువెళ్లారు. ఇందుకు సీఎం స్పందిస్తూ.. అనంత అర్బన్‌కు అండర్ డ్రైనేజీ నిర్మాణానికి చర్యలు తీసుకుంటామని, నగర ప్రజలకు ఎలాంటి సమస్యలు లేకుండా పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు.



సీఎంతో దగ్గుపాటి

అనంతలో అభివృద్ధి పనులకు నిధులివ్వండి: నగరంలో అభివృద్ధి పనులకు నిధులు మంజూరు చేయాలని రాష్ట్ర మున్సిపల్ శాఖ మంత్రి నారాయణను ఎమ్మెల్యే దగ్గుపాటి వెంకటేశ్వరప్రసాద్ కోరారు. గురువారం విజయవాడలోని ఏపీ సచివాలయంలో మంత్రిని కలిసి పలు సమస్యలపై వినతి పత్రం అందజేశారు. నగరంలో అండర్ గ్రౌండ్ డ్రైనేజీ ఏర్పాటుతో పాటు డంపింగ్ యార్డు తరలింపు, రోడ్ల నిర్మాణం తదితర అంశాలను మంత్రి దృష్టికి తీసుకువెళ్లారు. జిల్లా కేంద్రం అయినా కనీస మౌలిక సదుపాయలు లేకుండాపోయాయన్నారు. అనేక కాలనీల్లో సరైన రోడ్లు, డ్రైనేజీ తదితర సమస్యలున్నాయన్నారు. రక్షిత నీటి సరఫరా, వీధి లైట్లు, టాయిలెట్ సదుపాయలు కల్పించాల్సి ఉందన్నారు. గతంలో చేపట్టిన వివిధ అభివృద్ధి పనులకు సంబంధించి రూ.25 కోట్లు మంజూరు చేయాలన్నారు. అనంతరం రాష్ట్ర రవాణా, యువజన, క్రీడా శాఖ మంత్రి రాంప్రసాద్‌రెడ్డిని ఎమ్మెల్యే కలిశారు. నగరంలోని ఇండోర్ స్టేడియం మరమ్మతులు, నూతన ఓపెన్ జిమ్‌ల ఏర్పాటు, పాత జిమ్‌ల మరమ్మతుల కోసం నిధులు కేటాయించాలని మంత్రిని కోరారు. మడకశిర ఎమ్మెల్యే ఎంఎస్‌రాజు, బీసీ సంఘం నాయకులు జోగి రాజేంద్రలతో కలిసి మంత్రి అచ్చెన్నాయుడును ఎమ్మెల్యే కలిశారు. అనంతపురం నగరంలో బీసీ భవన్‌ను ఏర్పాటు చేసేందుకు చర్యలు తీసుకోవాలని కోరారు. ఇందుకు మంత్రి స్పందిస్తూ... జిల్లా కలెక్టర్ వినోద్‌కుమార్‌కు ఫోన్‌లో మాట్లాడారు. బీసీ భవన్ కోసం స్థల సేకరణ పూర్తి చేసి, నిధులు ఎంత అవసరమో అంచనాలు సిద్ధం చేసి పంపాలని సూచించారు.



మంత్రి నారాయణకు వినతిపత్రం ఇస్తున్న ఎమ్మెల్యే

క్రీడలతో శారీరక, మానసికోల్లాసం

అనంతపురం కల్చరల్, ఆగస్టు 29: విద్యార్థులకు క్రీడలు శారీరక, మానసికోల్లాసాన్ని కలిగిస్తాయని ఆర్యన్ స్కూల్ డైరెక్టర్లు పేర్కొన్నారు. హౌసింగ్ బోర్డులోని ఆర్యన్ స్కూల్‌లో 7వ తరగతి చదువుతున్న విద్యార్థులు అఖిలేష్, కల్యాణ్, ఈశ్వరసింహ ఇటీవల నిర్వహించిన రాష్ట్రస్థాయి టార్గెట్ బాల్ పోటీల్లో గెలుపొంది జాతీయ పోటీలకు ఎంపికయ్యారు. ఈనెల 30 నుంచి సెప్టెంబరు 1వ తేదీ వరకు అన్నమయ్య జిల్లా రాయచోటిలో జరిగే జాతీయస్థాయి పోటీల్లో వీరు పాల్గొననున్నారు. ఈ నేపథ్యంలో గురువారం స్కూల్ ఆవరణలో విద్యార్థులను పాఠశాల డైరెక్టర్లు నాగరాజు, సందీప్, ప్రిన్సిపాల్ సైకాలజిస్టు లహరి అభినందించారు. వ్యాయామ ఉపాధ్యాయుడు హుసేన్, అధ్యాపక బృందం పాల్గొన్నారు.



ఎంపికైన విద్యార్థులతో పాఠశాల యాజమాన్యం

విద్యార్థుల సేవాభావం అభినందనీయం

అనంతపురం క్లాక్‌టవర్, ఆగస్టు 29: కేరళ వయనాడ్ వరద బాధితుల కోసం విరాళాలు సేకరించిన ఎన్ఎస్ఎస్ విద్యార్థుల సేవాభావం అభినందనీయమని అర్బన్ బ్యాంకు ఛైర్మన్ జేఎల్ మురళీధర్ అన్నారు. ఆర్ట్స్ కళాశాల ఎన్ఎస్ఎస్ వలంటీర్లు నగరంలో వరద బాధితుల సహాయార్థం విరాళాలు సేకరించారు. తన వంతుగా విరాళం అందజేసిన మురళీధర్ విద్యార్థులను అభినందించారు. ఆర్ట్స్ కళాశాల ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ విష్ణుప్రియ, ఎస్ఆర్ ఎడ్యుకేషనల్ సొసైటీ అధ్యక్షుడు సుంకర రమేష్, అర్బన్ బ్యాంకు డైరెక్టర్లు వెంకటాద్రి, చంద్రశేఖర్, రొళ్ల బాస్కర్, సభ్యులు మధుసూదన్ గౌడ్, పసుపులేటి రమేష్, మార్కెట్ శ్రీధర్, అనీల్‌నాయుడు పాల్గొన్నారు.

ఐకాన్ ఆఫ్ ది ఇయర్‌గా ఎరా స్కూల్ ఛైర్మన్

అనంతపురంరూరల్,ఆగస్టు 29: ఎడ్యులీడర్స్ సమ్మిట్ అండ్ అవార్డ్స్‌లో మండలంలోని ఎరా ఇంటర్నేషనల్ స్కూల్ ఛైర్మన్ 2024 ఎడ్యుకేషన్ ఐకాన్ ఆఫ్ ది ఇయర్‌గా ఎన్నికయ్యారు. ఆమేరకు హైదరాబాదులో జరిగిన అవార్డుల ప్రదానోత్సవంలో ఎరా విద్యా సంస్థల ఛైర్మన్ అరుణ్‌కుమార్‌రెడ్డి అవార్డు అందుకున్నారు. అవార్డు అందుకోవడం పట్ల అరుణ్‌కుమార్‌రెడ్డి సంతోషం వ్యక్తం చేశారు. స్కూల్ ఉపాధ్యాయులు, సిబ్బంది కారణంగానే తనకు ఈ అవార్డు దక్కిందన్నారు. విద్యార్థులకు మరింత ఉన్నత విద్యాబోధనలు, విద్యను అందచేందుకు ఇలాంటి ప్రోత్సహకాలు దోహదం చేస్తాయన్నారు.



అవార్డు అందుకుంటున్న ఛైర్మన్ అరుణ్ కుమార్ రెడ్డి

ట్రాఫిక్ క్రమబద్ధీకరణకు కృషి చేయండి: ఎస్పీ

అనంతపురం క్రైం,ఆగస్టు 29: జిల్లా కేంద్రంలో ట్రాఫిక్ క్రమబద్ధీకరణ మెరుగుదలకు కృషి చేయాలని జిల్లా ఎస్పీ జగదీష్ ఆదేశించారు. నగరంలోని రద్దీ ప్రాంతాల్లో ఎస్పీ పర్యటించి ట్రాఫిక్ పరిస్థితులను, కొత్తగా ఏర్పాటు చేసిన ట్రాఫిక్ సిగ్నలింగ్ వ్యవస్థను పరిశీలించారు. స్థానిక సప్తగిరి సర్కిల్, సూర్యానగర్ జంక్షన్, శ్రీకంఠం సర్కిల్, క్లాక్‌టవర్, కళ్యాణదుర్గం బైపాస్, తపోవనం కూడళ్లలో పర్యటించి వాహనాల రాకపోకలను పరిశీలించి సులువుగా సాగేందుకు కొన్ని సూచనలు చేశారు. ట్రాఫిక్ సీఐ రఘుప్రసాద్, నాలుగో పట్టణ సీఐ సాయినాథ్, ఆర్ఐ మధులు పాల్గొన్నారు. అనంతరం జిల్లా పోలీస్ హెడ్ క్వార్టర్స్‌లో అమలవుతున్న సంక్షేమ కార్యక్రమాలను జిల్లా ఎస్పీ పరిశీలించారు.

బాధ్యతలు చేపట్టిన రూరల్ డివిజన్ ఈఈ

అనంతపురంరూరల్, ఆగస్టు 29: విద్యుత్‌శాఖ అనంతపురంరూరల్ డివిజన్ ఈఈగా రాములు బాధ్యతలు చేపట్టారు. గురువారం స్థానిక పవర్ ఆఫీస్‌లోని రూరల్ డివిజన్ కార్యాలయంలో ఆయన బాధ్యతలు తీసుకున్నారు. ఈయన తిరుపతి ఎస్పీడీసీఎల్ ప్రధాన కార్యాలయంలో ఎంక్వైరీస్ డీఈఈగా పనిచేస్తూ ఉద్యోగోన్నతిపై ఇక్కడకు బదిలీ అయ్యారు. ముందుగా ఎస్ఈ సంపత్‌కుమార్‌కు పుష్పగుచ్ఛాలు అందజేసి రిపోర్ట్ చేసుకున్నారు. అనంతరం ఇన్‌చార్జ్ ఈఈ జేవీ రమేష్ నుంచి బాధ్యతలు తీసుకున్నారు.

5 నుంచి నిరవధిక సమ్మె

● సీఐటీయూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఓబులు

అనంతపురం కల్చరల్, ఆగస్టు 29: బకాయి వేతనాలు చెల్లించాలని డిమాండ్ చేస్తూ సత్యసాయి, శ్రీరామిరెడ్డి వాటర్‌వర్క్స్ కార్మికులు సెప్టెంబరు 5వ తేదీ నుంచి నిరవధిక సమ్మె చేపట్టనున్నారని, ఈ సమ్మెకు ప్రజా, కార్మిక సంఘాలు మద్దతుగా నిలువనున్నాయని సీఐటీయూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఓబులు అన్నారు. గురువారం జేవీవీ జిల్లా కార్యాలయంలో నిర్వహించిన రౌండ్‌టేబుల్ సమావేశంలో ఆయన మాట్లాడారు. కార్మికులకు నెలల తరబడి వేతనాలు చెల్లించకుండా ప్రభుత్వాలు జాప్యం చేయడం అన్యాయమన్నారు. కార్మికులకు వెంటనే బకాయి వేతనాలు చెల్లించాలని కోరారు. తాగునీటి మోటార్లకు మీటర్లు బిగించే విధానాన్ని కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిందని, ఈ విధానం వల్ల భవిష్యత్తులో ప్రజలపై తీవ్రమైన భారం పడే ప్రమాదముందన్నారు. కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా అధ్యక్ష కార్యదర్శులు నాగమణి, నాగేంద్రకుమార్, ఐఎఫ్‌టీయూ జిల్లా కార్యదర్శి ఏసురత్నం, ఏజీటీయూసీ జిల్లా కార్యనిర్వాహక అధ్యక్షుడు వీకే కృష్ణుడు, ఏపీ రైతుసంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి చంద్రశేఖర్‌రెడ్డి, ఏపీ కౌలురైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి బాలరంగయ్య, గోపాల్, నాగభూషణ తదితరులు పాల్గొన్నారు.

డీసీఓను సస్పెండ్ చేయాలి

● కలెక్టరేట్ వద్ద దళిత సంఘాల నాయకుల నిరసన



కలెక్టరేట్ ముందు నిరసన తెలుపుతున్న దళిత విద్యార్థి సంఘాల నాయకులు

అనంతపురం ప్రెస్‌క్లబ్, ఆగస్టు 29: ఉమ్మడి అనంతపురం జిల్లాలోని అంబేడ్కర్ గురుకులాల్లో 5వ తరగతి అడ్మిషన్ల ప్రక్రియలో అవినీతికి పాల్పడిన డీసీఓను వెంటనే సస్పెండ్ చేయాలని పలు దళిత సంఘాల నాయకులు డిమాండ్ చేశారు. గురువారం నగరంలోని 200 మంది దళిత విద్యార్థి సంఘాల నాయకులు భారీ ర్యాలీతో కలెక్టరేట్ వద్ద నిరసనకు దిగారు. ఈ సందర్భంగా పోలీసులు, విద్యార్థి సంఘాలనాయకుల మధ్య తోపులాట జరిగింది. కలెక్టరేట్ గేట్లు ఎక్కేందుకు ప్రయత్నించగా వారిని అక్కడి నుంచి లాగేశారు. ఆల్ ఇండియా ఎస్సీ,ఎస్టీ ఐక్యవేదిక నాయకులు మధుప్రసాద్, ఎంఎస్ఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు జెన్నె చిరంజీవి, వీసీకే రాష్ట్ర కార్యదర్శి మందల రమేష్ మాట్లాడుతూ గురుకులాల్లో 5వ తరగతి అడ్మిషన్లలో జరిగిన అవినీతిపై జిల్లా ఉన్నతాధికారులు విచారణ జరిపించాలన్నారు. లేని పక్షంలో పెద్ద ఎత్తున ఉద్యమాలు ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ముట్టడిలో బీఎస్‌యూ జిల్లా అధ్యక్షుడు లక్ష్మీనారాయణ, వెంకీ, రాజశేఖర్, రాళ్లపల్లి చంద్రశేఖర్, సాకే నరసింహులు, మారెన్న, బొమ్మన్న రాజు, మారుతి, రాజు, వివేక్, ఆనంద్, చైతన్య, రాము, రామాంజి, మద్దెలచెరువు సూరి, ప్రకాష్, విజయ్ పాల్గొన్నారు.

ట్రెల్లిస్ స్కూల్‌కు 'టైమ్స్' ఎక్సలెన్స్ అవార్డు

అనంతపురం విద్య, ఆగస్టు 29: నగరంలోని ది ట్రెల్లిస్ స్కూల్‌ను మీడియా దిగ్గజం టైమ్స్ ఆఫ్ ఇండియా అవార్డు వరించిందని స్కూల్ ఫౌండర్, ఛైర్మన్ శ్రీకాంత్ వడ్ల తెలిపారు. గురువారం ఆయన మాట్లాడుతూ పాఠశాల విద్యారంగంలో తమ స్కూల్ అందిస్తున్న సేవలకు గుర్తించి ప్రముఖ మీడియా సంస్థ టైమ్స్ ఆఫ్ ఇండియా నుంచి 'ఎక్సలెన్స్ ఇన్ స్కూల్ ఎడ్యుకేషన్' అవార్డు దక్కిందని ఆనందం వ్యక్తం చేశారు. విజయవాడలో బుధవారం జరిగిన అవార్డుల ప్రదానోత్సవ కార్యక్రమంలో ఏపీ పరిశ్రమల శాఖ మంత్రి భరత్ చేతలు మీదుగా అవార్డును స్వీకరించినట్లు ఆయన తెలిపారు.



అవార్డు అందుకుంటున్న ఛైర్మన్ శ్రీకాంత్ వడ్ల

ఆర్వో ప్లాంట్, జనరేటర్‌కు మరమ్మతులు

శింగనమల ఆగస్టు 29: స్థానిక కమ్యూనిటీ హెల్త్ సెంటర్‌లో రెండేళ్లుగా జనరేట్, ఆర్వోప్లాంట్ పనచేయని విషయాన్ని తెలుసుకున్న ఎమ్మెల్యే బండారు శ్రావణిశ్రీ సొంత ఖర్చులతో వాటికి మరమ్మతు చేయించారు. రెండేళ్లుగా ఆస్పత్రిలో రోగులు తాగేందుకు నీరు లేక అల్లాడిపోయారు. ఆపరేషన్ సమయంలో విద్యుత్ పోతే జనరేటర్ పనిచేయకపోవడంతో డాక్టర్లు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొనేవారు. సమస్యను స్థానిక టీడీపీ నాయకులు ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లారు. ఆమె వెంటనే స్పందించి సొంత ఖర్చులతో మరమ్మతు చేయించారు. ఎమ్మెల్యేకు నాయకులు వెంకటేశ్, బోయ సత్తి, మాసూల చంద్ర, ఆదినారాయణ, రాముడు కృతజ్ఞతలు తెలిపారు.

టీడీపీ కార్యకర్త మృతి

అనంతపురంరూరల్, ఆగస్టు 29: మండలంలోని కురుగుంట వైఎస్సార్ కాలనీకి చెందిన టీడీపీ కార్యకర్త ఆనంద్(25) అనారోగ్యంతో గురువారం మృతి చెందాడు. విషయం తెలుసుకున్న తెలుగు రైతు అధ్యక్షులు కురుగుంట నారాయణ స్వామి ఆనంద్ ఇంటికి వెళ్లి మృతదేహానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. కుటుంబాన్ని పరామర్శించి.. తన వంతు సాయంగా రూ.5వేలు ఆర్థిక సాయం చేశారు. గ్రామ కమిటీ అధ్యక్షుడు విజయ్‌కుమార్ పాల్గొన్నారు.

విద్యార్థి దశనుంచే క్రీడలపై ఆసక్తి పెంచుకోవాలి: వీసీ

అనంతపురం సెంట్రల్/క్లాక్‌టవర్, ఆగస్టు 29: విద్యార్థి దశనుంచే క్రీడల్లో పాల్గొనే ఆసక్తిని పెంచుకోవాలని ఎస్కేయూ ఇన్‌చార్జ్ వీసీ ప్రొఫెసర్ అనిత పేర్కొన్నారు. ఎస్కేయూలో నిర్వహించిన జాతీయ క్రీడా దినోత్సవ వేడుకల్లో ప్రొఫెసర్ అనిత, రెక్టార్ వెంకటనాయుడు, రిజిస్ట్రార్ డాక్టర్ రమేష్ పాల్గొన్నారు. ధ్యాన్‌చంద్ చిత్రపటానికి ఘన నివాళులర్పించారు. ఎస్వీ డిగ్రీ కళాశాల, రుద్రంపేట ప్రభుత్వ పాఠశాలలోనూ జాతీయ క్రీడా దినోత్సవాన్ని నిర్వహించి విద్యార్థులకు పోటీలు నిర్వహించారు.

క్రీడలతో అంతర్జాతీయ గుర్తింపు: క్రీడలతో అంతర్జాతీయ గుర్తింపు లభిస్తుందని, అందుకు హాకీ దిగ్గజం ధ్యాన్‌చంద్ నిదర్శనమని జేఎన్‌టీయూ ఓఎస్‌డీటు వీసీ ప్రొఫెసర్ దేవన్న అన్నారు. బుధవారం జాతీయ క్రీడా దినోత్సవాన్ని పురస్కరించుకుని జేఎన్‌టీయూలో ధ్యాన్‌చంద్ జయంతి వేడుకలు, విద్యార్థులకు క్రీడా పోటీలను నిర్వహించారు. ప్రిన్సిపాల్ చెన్నారెడ్డి, వైస్ ప్రిన్సిపాల్ వసుంధర పాల్గొన్నారు.

ఎస్ఎస్‌బీఎన్‌లో: నగరంలోని ఎస్ఎస్‌బీఎన్ కళాశాలలో క్రీడాదినోత్సవాన్ని నిర్వహించారు. మేజర్ ధ్యాన్‌చంద్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. క్రీడాపోటీల విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు. అంతర్జాతీయ కబడ్డీ క్రీడాకారుడు విశ్వనాథ్ చౌదరి, కళాశాల ప్రిన్సిపాల్ ప్రభాకర్‌రాజు, అధ్యక్ష, కార్యదర్శులు రమణారెడ్డి, పీఎల్ఎన్ రెడ్డి, సభ్యుడు ఎర్రిస్వామి, పీడీ ప్రసాద్ పాల్గొన్నారు.

ఆర్ట్స్ కళాశాలలో: మేజర్ ధ్యాన్‌చంద్ జయంతిని పురస్కరించుకుని గురువారం స్థానిక ఆర్ట్స్ కళాశాలలో జాతీయ క్రీడాదినోత్సవాన్ని నిర్వహించారు. క్రీడాపోటీల విజేతలకు బహుమతులు ప్రదానంచేశారు. ప్రిన్సిపాల్ దివాకర్ రెడ్డి, పీడీలు జెబీవుల్లా, శ్రీరామ్, ఏఓ రమణ పాల్గొన్నారు.

రాప్తాడు: విద్యార్థులు విద్యతో పాటూ క్రీడల్లోనూ రాణించాలని సర్పంచ్ సాకే తిరుపాలు సూచించారు. జాతీయ క్రీడా, తెలుగు బాషా దినోత్సవం సందర్భంగా గురువారం ఉన్నత పాఠశాల విద్యార్థులు ర్యాలీ నిర్వహించారు. విద్యార్థులకు క్రీడా పోటీలు నిర్వహించి గెలుపొందిన వారికి బహుమతులు అందచేశారు. ఇన్‌చార్జి హెచ్ఎం నరసింహులు, పీఈటీ కేశవమూర్తి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



ధ్యాన్‌చంద్ చిత్రపటం వద్ద నివాళి అర్పిస్తున్న ఎస్కేయూ వీసీ



గెలుపొందిన విద్యార్థులతో సెంట్రల్ యూనివర్సిటీ వీసీ కోరి

రూరల్ సీఐగా శివగంగాధర్ రెడ్డి

తాడిపత్రి, ఆగస్టు 29: పట్టణంలోని రూరల్ పోలీస్ స్టేషన్‌లో నూతన సీఐగా శివగంగాధర్‌రెడ్డి గురువారం బాధ్యతలు స్వీకరించారు. ఈ స్థానంలో విధులు నిర్వహిస్తున్న లక్ష్మీకాంత్‌రెడ్డి బదిలీపై వీఆర్‌కు వెళ్లారు. దీంతో అనంతపురంలోని ఏసీబీలో పనిచేస్తున్న శివగంగాధర్‌రెడ్డి ఇక్కడకు వచ్చారు.

ఆర్‌డబ్ల్యూఎస్ జేఈ బదిలీ

పుట్లూరు, ఆగస్టు 29: మండల ఆర్‌డబ్ల్యూఎస్ జేఈ రామలింగారెడ్డి బదిలీ అయ్యారు. ఈయన పుట్లూరు నుంచి గుత్తికి బదిలీపై వెళ్లారు. ఈ మేరకు ఉన్నతాధికారులు గురువారం ఉత్తర్వులు జారీచేశారు. ఈ స్థానంలో ఇంకా ఎవరిని నియమించలేదు.

చికిత్స పొందుతూ యువకుడి మృతి

యాడికి, ఆగస్టు 29: కడుపునొప్పి తాళలేక విషద్రావకం తాగిన తూట్రాళ్లపల్లి గ్రామానికి చెందిన యువకుడు రాకేష్ (22) చికిత్స పొందుతూ గురువారం మృతిచెందాడు. శ్రీరంగ కుమారుడు రాకేష్ కొద్దిరోజులుగా కడుపునొప్పితో బాధపడుతుండేవాడు. ఆరునెలల క్రితం వివాహమైంది. కాగా కడుపునొప్పితో బాధపడుతున్న అతను మందులు సరిగా వాడకపోవడంతో తీవ్ర అనారోగ్యం పాలయ్యాడు. ఈ క్రమంలో నొప్పి భరించలేక రెండురోజులక్రితం విషద్రావకం తాగి ఆత్మహత్యకు యత్నించాడు. గమనించిన కుటుంబ సభ్యులు చికిత్స నిమిత్తం కర్నూలుకు తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ గురువారం మృతిచెందినట్లు పోలీసులు తెలిపారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదుచేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు చెప్పారు.

మత్తుపదార్థాల జోలికి వెళ్లకండి

గుంతకల్లుటౌన్, ఆగస్టు 29: యువత మత్తుపదార్థాల జోలికి వెళ్లరాదని ఎక్సైజ్ సీఐ సుహాసిని, ఎస్ఐ బ్రహ్మయ్య సూచించారు. పట్టణంలోని ఎస్కేపీ డిగ్రీ కళాశాలలో గురువారం వారు మత్తుపదార్థాల వల్ల కలిగే నష్టాలపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈసందర్భంగా మాట్లాడుతూ విద్యార్థులు యువత మత్తుపదార్థాల జోలికి వెళ్లరాదన్నారు. వాటి వల్ల కలిగే మానసిన, శారీరక రుగ్మతల గురించి వివరించారు. కళాశాల ప్రిన్సిపాల్ లక్ష్మయ్య, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం అధికారి నారాయణ, మహిళాసాధికారత విభాగం అధికారి వాణిశ్రీ, అధ్యాపకులు, తదితరులు పాల్గొన్నారు.

ఉచిత శిక్షణకు దరఖాస్తు చేసుకోండి

గుంతకల్లుటౌన్, ఆగస్టు 29: ఐటీఐ, స్కిల్ ఇండియా సెంట్రల్ కింద ప్రధాన మంత్రికౌశల్ యోజనలో భాగంగా మూడు నెలల స్వల్పకాలిక కోర్సుల కొరకు ఉచిత శిక్షణ కోసం దరఖాస్తు చేసుకోవాలని పట్టణంలోని ప్రభుత్వ ఐటీఐ ప్రిన్సిపాల్ విద్యాసాగర్ గురువారం ప్రకటనలో తెలిపారు. పదో తరగతి ఉత్తీర్ణత, ఆపై చదువుకుని 18నుంచి 30 ఏళ్ల వయస్సు కలిగిన వారు దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. విద్యార్హత సర్టిఫికెట్, ఆధార్ జిరాక్స్‌తో పాటు పాస్‌ఫోటోలతో సెప్టెంబరు 1న ఐటీఐలో దరఖాస్తు సమర్పించాలని తెలిపారు.

పంట కోత ప్రయోగాలు చేపట్టాలి

బెళుగుప్ప, ఆగస్టు 29: మండలంలో ఖరీఫ్‌లో సాగు చేసిన ప్రతి పంటకు పంట కోత ప్రయోగాలు చేపట్టాలని, అలాగే నమోదు ప్రక్రియ చేపట్టాలని ఏఎస్‌వో మమత సిబ్బందికి సూచించారు. మండలకేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయంలో గురువారం ఆమె పంట కోత ప్రయోగాలు, నమోదు ప్రక్రియపై వీఆర్వోలు, సచివాలయాల సిబ్బందికి శిక్షణ అవగాహన కల్పించారు. పొరపాట్లుకు తావివ్వకుండా పంటల నమోదు చేయాలని సూచనలిచ్చారు. కార్యక్రమంలో ఏవో పృథ్వీసాగర్, డీటీ హుస్సేన్‌పీరా, ఏఈవో భాగ్యశ్రీ తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరికి తీవ్ర గాయాలు

కళ్యాణదుర్గం రూరల్, ఆగస్టు 29: మండలంలోని గొల్ల గ్రామం వద్ద ద్విచక్ర వాహనాన్ని ఆర్టీసీ బస్సు ఢీకొనడంతో ఒకరికి తీవ్ర గాయాలయ్యాయి. అనంతపురం నుంచి కళ్యాణదుర్గం వైపు వెళ్తున్న ఆర్టీసీ బస్సు గొల్లగ్రామం వద్ద ఎదురుగా వస్తున్న ద్విచక్ర వాహనాన్ని ఢీకొంది. ప్రమాదంలో బైక్‌పై ప్రయాణిస్తున్న శంకరయ్యకు తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు వెంటనే కళ్యాణదుర్గం ప్రభుత్వాస్పత్రికి తరలించారు. పరిస్థితి విషమంగా ఉండటంతో అనంతపురం ప్రభుత్వాస్పత్రికి తరలించారు. రూరల్ పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

పేకాటరాయుళ్ల అరెస్టు

కుందుర్పి, ఆగస్టు 29 : మండలంలోని శ్రీమజ్జనపల్లి గ్రామ సమీపాన పేకాట స్థావరంపై బుధవారం రాత్రి దాడులు నిర్వహించినట్లు ఎస్ఐ వెంకటస్వామి తెలిపారు. అందిన సమాచారం మేరకు సిబ్బందితో కలిసి పేకాట స్థావరంపై దాడులు చేశామని, అందులో పేకాట ఆడుతున్న ఐదుగురిని అదుపులోకి తీసుకుని వారి వద్ద నుంచి రూ.85,300 నగదును స్వాధీనం చేసుకున్నామని తెలిపారు. పేకాట ఆడుతున్న మరో ముగ్గురు పారిపోయారని, వారిపై కూడా కేసు నమోదు చేస్తామని ఎస్ఐ పేర్కొన్నారు.

పురాతన ఆలయం పరిశీలన

కుందుర్పి, ఆగస్టు 29: మండల కేంద్రంలోని పురాతన శివాలయాన్ని పురావస్తు శాఖ సహాయ సంచాలకురాలు డాక్టర్ రజిత గురువారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆలయం లోపల బయట రాతి గోడలపై చెక్కిన శిల్పాలను పరిశీలించి 17, 18వ శతాబ్దంలో నిర్మించిన ఆలయంగా అంచనా వేశారు. పురావస్తు శాఖ సాంకేతికుడు మహేంద్రనాయుడు, రిటైర్డ్ డిప్యూటీ డైరెక్టర్ విజయ్‌కుమార్, చరిత్ర పరిశోధకుడు రమేష్ ఉన్నారు.

ఇసుక ట్రాక్టర్ సీజ్

కుందుర్పి, ఆగస్టు 29: మండలంలోని ఎనుముల దొడ్డి గ్రామానికి చెందిన ఖాసీమ్ గురువారం ఇసుకను అక్రమంగా ట్రాక్టర్‌లో తరలిస్తుండగా పట్టుకుని అదుపులోకి తీసుకున్నట్లు ఎస్ఐ వెంకటస్వామి తెలిపారు. ఎలాంటి అనుమతులు లేకుండా సమీప వాగులోని ఇసుకను అక్రమంగా తరలిస్తుండగా పట్టుకున్నామన్నారు. ట్రాక్టర్‌ను మండలకేంద్రంలోని పోలీసుస్టేషన్లో వుంచామని, కేసు నమోదు చేశామని చెప్పారు.

అక్రమ మద్యం ధ్వంసం

కళ్యాణదుర్గంరూరల్, ఆగస్టు 29 : కళ్యాణదుర్గం సెబ్, పట్టణ సర్కిల్ పరిధిలో వివిధ కేసులలో పట్టుబడిన అక్రమ మద్యంను గురువారం ధ్వంసం చేశారు. పట్టణ సమీపంలోని ఫారెస్టుకు దగ్గరలోని ఖాళీ స్థలంలో 1550 లీటర్ల కర్ణాటక టెట్రా, ఆంధ్ర మద్యంను సెబ్ అసిస్టెంట్ సూపరింటెండెంట్ శ్రీరామ్, సెబ్ సీఐ ఎర్ర వెంకట్, పట్టణ ఏఎస్ఐ నారాయణరెడ్డి ఆధ్వర్యంలో ధ్వంసం చేశారు.

శ్రీరామిరెడ్డి పథకం పైప్ లైన్ లీకేజీ

● నీట మునిగిన వేరుశనగ పంట

కళ్యాణదుర్గంరూరల్, ఆగస్టు 29: మండలంలోని గరుడాపురం గ్రామం వద్ద శ్రీరామ రెడ్డి తాగునీటి పథకం పైపులైన్ ఎయిర్ వాల్ లీక్ అవడంతో నీరంతా రైతు తిప్పేస్వామికి చెందిన వేరుశనగ పొలంలోకి వెళ్లింది. దీంతో పంటంతా నీటమునిగింది. ఇక్కడి పైప్‌లైన్ తరచుగా లీక్ అవుతోందని, దీంతో సమీపం పంట పొలాలు నీటితో నిండిపోతున్నాయని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. తాత్కాలిక మరమ్మతులు చేస్తుండడం వల్ల ఫలితం లేకుండా పోతోందన్నారు. లీకేజీ కాకుండా శాశ్వత పరిష్కారం చూపాలని కోరుతున్నారు.

మాతృభాషను మరువరాదు

● తెలుగును ప్రతిఒక్కరూ ఆదరించాలి ● ఎమ్మెల్యే కాలవ శ్రీనివాసులు

రాయదుర్గంరూరల్, ఆగస్టు 29: మాతృభాష అయిన తెలుగును ఎవరూ మరువరాదని, తెలుగుభాషను ఆదరించాలని ఎమ్మెల్యే కాలవ శ్రీనివాసులు సూచించారు. 74 ఉడేగోళం సమీపంలోని టెక్స్‌టైల్స్ పార్క్‌లో గల ఉచిత డీఎస్సీ కోచింగ్ కేంద్రంలో గురువారం తెలుగుభాషా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే పాల్గొన్నారు. తొలుత తెలుగు భాషా ఉద్యమ పితామహుడు గిడుగు వెంకటరామ్మూర్తి చిత్రపటానికి పూల మాల వేసి ఘన నివాళులర్పించారు. అనంతరం మాట్లాడుతూ తెలుగుభాష అమ్మలాంటిదని, ఎవరూ విస్మరించకూడదని తెలిపారు. ఆంగ్లం మోజులో పడి తెలుగుభాషను మరవకూడదన్నారు. అలాగే స్థానిక కేటీఎస్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో తెలుగుభాషా, క్రీడా దినోత్సవాలు ప్రిన్సిపాల్ రఘురామమూర్తి ఆధ్వర్యంలో జరిగాయి. ముఖ్యఅతిథిగా ఎమ్మెల్యే కాలవ శ్రీనివాసులు పాల్గొన్నారు. తొలుత అక్కడ రూ. 1.4 కోట్ల రూసా నిధులతో నిర్మించిన ఆరు అదనపు గదులను ప్రారంభించారు. అనంతరం మాట్లాడుతూ.. విద్యార్థులు విద్యతో పాటు క్రీడల్లోనూ రాణించాలన్నారు. అలాగే నైతిక విలువలను అలవర్చుకుని, క్రమశిక్షణతో విద్యనభ్యసించాలని, దేశం గర్వించేస్థాయికి ఎదగాలని సూచించారు. తెలుగుభాష అమ్మ లాంటిదన్నారు. మాతృభాషను మరువకుండా ఆదరించాలని కోరారు. డిగ్రీ కళాశాలకు ప్రహరీ, అర్ధంతరంగా ఆగిన లైబ్రరీ , సమావేశ గది నిర్మాణానికి, కళాశాలలో ఖాళీగా ఉన్న పోస్టుల భర్తీకి తన వంతు కృషి చేస్తానని ఈ సందర్భంగా పేర్కొన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ దుర్గమ్మ, జడ్పీటీసీ మల్లికార్జున, టీడీపీ పట్టణ అధ్యక్షుడు పసుపులేటి రాజు, మండల కన్వీనర్ హనుమంతు, కౌన్సిలర్ ప్రశాంతి, మాజీ కౌన్సిలర్లు టంకశాల హనుమంతు, పొరాళు పురుషోత్తం పాల్గొన్నారు.

తేనె కన్నా మధురం తెలుగు

తాడిపత్రి: తేనెకన్నా మధురం తెలుగుభాష అని తెలుగు అధ్యాపకుడు డాక్టర్ విజయభాస్కర్ పేర్కొన్నారు. పట్టణంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో తెలుగుభాషా దినోత్సవం, క్రీడా దినోత్సవ వేడుకలను ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ జక్కా సత్యనారాయణ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా తెలుగు అధ్యాపకుడు మాట్లాడుతూ తెలుగు సాహిత్యాన్ని సరళీకరించి, తెలుగు తీయదనాన్ని సామాన్యుడికి చేరువ చేసిన మహోన్నత వ్యక్తి గిడుగు రామ్మూర్తి పంతులు అని తెలిపారు. ఆయన జయంతి సందర్భంగా తెలుగుభాషా దినోత్సవాన్ని నిర్వహించుకుంటున్నామన్నారు. విద్యార్థులు ఎన్ని భాషలు నేర్చినా మాతృభాషను మరవకూడదని పేర్కొన్నారు. వ్యాయామ అధ్యాపకురాలు జయలక్ష్మి మాట్లాడుతూ జాతీయ హాకీ క్రీడాకారుడు ధ్యాన్‌చంద్ జయంతిని పురస్కరించుకుని క్రీడాదినోత్సవం జరుపుకుంటున్నామని తెలిపారు. అదేవిధంగా మండలంలోని వెంకటరెడ్డిపల్లి గ్రామ ప్రాథమికోన్నత పాఠశాలలో తెలుగుభాషా దినోత్సవ వేడుకలు నిర్వహించారు. హెచ్‌ఎం సుబ్బారావు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



కోచింగ్ కేంద్రంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కాలవ

ఉరవకొండ: పట్టణంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో తెలుగు భాషాదినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ రామకృష్ణ మాట్లాడుతూ దేశ భాషల అన్నింటిలో కెల్లా తెలుగుభాష ఎంతో గొప్పదన్నారు. తెలుగుపై విద్యార్థులు ఆసక్తిని పెంచుకోవాలన్నారు. మాతృభాషను కాపాడుకోవడం ప్రతి ఒక్కరి బాధ్యతని సూచించారు. కార్యక్రమంలో అధ్యాపకులు పరమేష్, రాజేష్, నారాయణ స్వామి, కృష్ణవేణి, ఆంజనేయులు విద్యార్థులు పాల్గొన్నారు.

గుంతకల్లుటౌన్,: పట్టణంలోని తిలక్‌నగర్‌లో గల శ్రీ రామభక్త కళానిలయంలో భారతీ సాహితీ సమితి ఆధ్వర్యంలో గిడుగు రామమూర్తి జయంతిని నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. సమితి అధ్యక్షుడు ఈఓ రాముడు, గౌరవసలహాదారు జీఎంవీ చలపతి, ప్రధాన కార్యదర్శి గంగమ్మ సభ్యులు పాల్గొన్నారు. అలాగే ఎస్కేపీ డిగ్రీ కళాశాలలో గిడుగురామమూర్తి జయంతిని పురష్కరించుకుని తెలుగు భాషా దినోత్సవం నిర్వహించారు.

బెళుగుప్ప: మండలకేంద్రంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో క్రీడా దినోత్సవంతో పాటు తెలుగు భాషా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఎస్ఎంసీ చైర్మన్ రుద్రయ్య ముఖ్య అతిథిగా పాల్గొని క్రీడలను ప్రారంభించారు. అలాగే తెలుగు భాష పితామహుడు గిడుగు వెంకట రామమూర్తి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. హెచ్‌ఎం వెంకట ప్రసాద్, ఉపాధ్యాయులు పీఈటీ పాల్గొన్నారు.

కుందుర్పి: మండలకేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలతో పాటు తెనగల్లు ఉన్నత పాఠశాలలో తెలుగుభాషాదినోత్సవాన్ని, క్రీడా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వక్తలు మాట్లాడుతూ తెలుగుభాష గొప్పతనాన్ని వివరించారు. అలాగే క్రీడల ప్రాముఖ్యతను తెలియజేశారు. కార్యక్రమంలో ఎస్ఎంసీ చైర్మన్ రాంబాబు, ఎంపీడీవో లక్ష్మీనరసింహ, ప్రధానోపాధ్యాయులు శోభన్ బాబు, గీతారాణి, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

పుట్లూరు: మండలంలోని ఆదర్శపాఠశాలలో తెలుగు భాషా దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాల చైర్మన్ నారాయణస్వామి మాట్లాడుతూ అమ్మలాంటి తెలుగు భాషను కాపాడుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. ప్రిన్సిపాల్ ఓబులరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఆది చెన్నకేశవస్వామి బ్రహ్మోత్సవాలు ప్రారంభం

ఉరవకొండ, ఆగస్టు 29: వజ్రకరూరు మండలం కొనకొండ్ల గ్రామంలో ఆది చెన్నకేశవస్వామి బ్రహ్మోత్సవాలు గురువారం ఘనంగా ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా అర్చకులు తొలుత ఆలయంలో స్వామి మూలవిరాట్‌కు పలు అభిషేకాలు, అలంకరణలు, ప్రత్యేక పూజలు నిర్వహించారు. సాయంత్రం నవగ్రహహోమం చేపట్టారు. రాత్రికి శ్రీదేవి, భూదేవి సమేతుడైన ఆది చెన్నకేశవ స్వామి ఉత్సవమూర్తులను పట్టువస్త్రాలతో అలంకరించి, వేదమంత్రాల నడుమ కల్యాణోత్సవాన్ని కన్నులపండువగా జరిపారు తిలకించడానికి భక్తులు పెద్దఎత్తున తరలివచ్చారు. కార్యక్రమంలో ఆలయ ఈఓ కృష్ణయ్య తదితరులు పాల్గొన్నారు.



ప్రత్యేక అలంకరణలో ఆది చెన్నకేశవస్వామి

31న అభయాంజనేయస్వామి రథోత్సవం

రాయదుర్గంరూరల్, ఆగస్టు 29: పట్టణంలోని మొలకాల్మూరు రోడ్డు చెక్‌పోస్టు సమీపంలో వెలసిన అభయాంజనేయస్వామి ఆలయంలో ఈ నెల 31వ తేదీన రథోత్సవ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు గురువారం ప్రకటనలో తెలిపారు. రథోత్సవంలో భాగంగా ముందు రోజు శుక్రవారం స్వామివారికి గణపతిహోమం, మహామంగళహారతి ప్రత్యేక పూజలు చేస్తామన్నారు. శనివారం రథోత్సవం నిర్వహిస్తామన్నారు. ఆదివారం సాయంత్రం 7 గంటలకు బాణాసంచా వేడుకలు, సోమవారం వసంతోత్సవం నిర్వహించనున్నట్లు చెప్పారు. ఈ సందర్భంగా ఐదురోజులు స్వామివారి ఆలయంలో అన్నదానం జరపనున్నట్లు చెప్పారు. శనివారం సాయంత్రం 4 గంటలకు రథోత్సవాన్ని నిర్వహించనున్నామని, భక్తులు పెద్దఎత్తున పాల్గొనాలని కోరారు.



అభయాంజనేయ స్వామి

పయ్యావుల కేశవ్ కాలనీలుగా ఏర్పాటు చేయాలి

ఉరవకొండ, ఆగస్టు 29: పట్టణంలోని కొలిమి లేఅవుట్, రాయంపల్లి లైఅవుట్‌లను పయ్యావుల కేశవ్ కాలనీలుగా ఏర్పాటు చేయాలని టీడీపీ నాయకులు కోరారు. ఈ మేరకు స్థానిక పంచాయతీ కార్యాలయంలో కార్యదర్శి గౌస్‌సాహెబ్‌ను గురువారం కలిసి వినతిపత్రం అందించారు. పలువురు మాట్లాడుతూ పయ్యావుల కేశవ్ ఎమ్మెల్సీగా ఉన్నపుడు ప్రత్యేక చొరవ చూపి నియోజకవర్గానికి 16వేల ఇళ్ల మంజూరు చేయించారన్నారు. ఉరవకొండలో 3వేల మందికి ఇళ్ల పట్టాలు మంజూరు చేయించారన్నారు. 2019 జనవరిలో పట్టాలు పొందిన లబ్ధిదారుల మేరకు పయ్యావుల కేశవ్ కాలనీగా పేరు ప్రతిపాదించి, తీర్మాణం చేయడం జరిగిందన్నారు. అప్పటి ప్రత్యేకాధికారిగా ఉన్న లోకన్న ఆమోదం కూడా తెలిపారన్నారు. కాగా గత వైసీపీ ప్రభుత్వం తీర్మాణాన్ని విస్మరించి, కొలిమి, రాయంపల్లి లేఅవుట్‌లుగా ఏర్పరచారన్నారు. పయ్యావుల కేశవ్ కృషికి గుర్తుగా గత తీర్మాణాన్ని సవరించి పయ్యావుల కేశవ్ కాలనీ-1, పయ్యావుల కేశవ్ కాలనీ-2గా ఏర్పాటు చేయాలని కోరారు. కార్యక్రమంలో పట్టణ కన్వీనర్ రామంజినేయులు, వార్డు సభ్యులు నిరంజన్ గౌడ్, ప్రభాకర్, రవి, రామాంజినేయులు , కేశవానంద, తిమ్మప్ప, వేల్పుల శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

సీఎం, డిప్యూటీ సీఎం చిత్రపటాల అందజేత

కళ్యాణదుర్గం రూరల్, ఆగస్టు 29 : పట్టణంలోని ప్రజావేదిక వద్ద ఎమ్మెల్యే అమిలినేని సురేంద్రబాబు చేతుల మీదుగా ముఖ్యమంత్రి చంద్రబాబు , ఉపముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ చిత్రపటాలను పలు ప్రభుత్వ కార్యాలయాలకు అందజేశారు. ఏపీఎన్జీవో రాష్ట్ర ఉపాధ్యక్షుడు మాధవ్, నారా లోకేష్ అభిమాన సంఘం జాతీయ అధ్యక్షుడు ఆనంద్‌రెడ్డి, టీడీపీ నాయకులు చల్లా కిషోర్ చౌదరి, అరుణ తదితరులు ఎమ్మెల్యే చేతుల మీదుగా ఫొటోలను తహసీల్దార్ భాస్కర్, డీఎస్పీ రవిబాబుకు అందజేశారు. కార్యక్రమంలో పట్టణ ఎన్జీవో సంఘం అధ్యక్షులు చెన్నారెడ్డి, మెడికల్ డిపార్ట్‌మెంట్ సోమశేఖర్, నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

వైద్యుల నిర్లక్ష్యంతోనే కౌసర్ మృతి

డీఎంహెచ్ఓ ఎదుట తల్లిదండ్రుల ఆవేదన

కణేకల్లు, ఆగస్టు 29: వైద్యుల నిర్లక్ష్యం కారణంగానే తమ కూతురు మృతి చెందిందని కౌసర్ తల్లిదండ్రులు డీఎంహెచ్ఓ డాక్టర్ ఈబీ దేవితో అన్నారు. యర్రగుంట గ్రామానికి చెందిన పీరావలి కూతురు కౌసర్ డెంగీతో చనిపోయిన విషయం తెలిసిందే. ఈ ఘటనపై డీఎంహెచ్ఓ గురువారం విచారించారు. గ్రామానికి వెళ్లి కౌసర్ తల్లిదండ్రులతో మాట్లాడారు. యర్రగుంట ఆసుపత్రిలో శని, ఆదివారాల్లో జరిగిన వైద్యం గురించి డీఎంహెచ్ఓకు వివరించారు. డాక్టర్ ఆస్పత్రిలో లేరని, సిబ్బంది సెలైన్ ఎక్కించడంతో తన కూతురుకు ఫిట్స్ వచ్చాయని తెలిపారు. తమ కూతురు మరణానికి కారణమైనవారిని వేరే ప్రాంతాలకు బదిలీ చేయాలని కోరారు. అనంతరం డీఎంహెచ్ఓ ఆసుపత్రి వైద్యులు, సిబ్బందితో సమావేశమయ్యారు. ఇలాంటి సంఘటనలు పునరావృతం కాకుండా తగిన చర్యలు తీసుకోవాలని సూచించారు. వైద్యుడిని విచారిస్తున్నామని, మరో వైద్యురాలిని ఇక్కడ నియమిస్తామని ఆమె తెలిపారు.



మృతురాలి తల్లితండ్రులతో మాట్లాడుతున్న డీఎంహెచ్ఓ

మృతుడి కుటుంబానికి ఆర్థికసాయం

పుట్లూరు, ఆగస్టు 29: మండలంలోని కోమటికుంట్ల గ్రామంలో గత జూలైలో జరిగిన ఇరువర్గాల ఘర్షణలో మృతిచెందిన వైసీపీ కార్యకర్త ఎరికలయ్య కుటుంబానికి గురువారం ఆ పార్టీ నాయకుడు సాంబశివారెడ్డి ఆర్థిక సాయం కింద రూ.5లక్షల చెక్కును అందించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ త్వరలో వైసీపీ అధినేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి వచ్చి ఆ కుటుంబాన్ని పరామర్శిస్తారని తెలిపారు. ఆ కుటుంబానికి అండగా ఉంటామని అన్నారు.

అనధికార లేఔట్లలో ప్లాట్లు కొనుగోలు చేయొద్దు

తాడిపత్రి, ఆగస్టు 29: పట్టణంలోని పలు ప్రాంతాల్లో అనధికార లేఔట్లు వేశారని వాటిలో ప్లాట్లను కొనుగోలు చేయవద్దని మున్సిపల్ కమిషనర్ శివరామకృష్ణ గురువారం ప్రకటనలో తెలిపారు. యల్లనూరు రోడ్డులో గల సర్వేనెంబరు 743-బీలో 2.02 ఎకరాలు, టీచర్స్‌కాలనీలోని సర్వేనెంబరు 620-బీలో 1.50ఎకరాలు, కృష్ణాపురం ఎక్స్‌టెన్షన్‌లో సర్వేనెంబరు 736-ఏలో 0.50ఎకరాల్లో అక్రమ లేఔట్లు ఏర్పాటు చేశారన్నారు. కావున ఈ ప్లాట్లకు సంబంధించి రిజిస్ట్రేషన్లు ఉండవని తెలిపారు. భవన నిర్మాణాలకు అనుమతులు మంజూరు చేయమని ఆయన తెలిపారు.

లాలూస్వామి హుండీ ఆదాయం లెక్కింపు

కణేకల్లు, ఆగస్టు 29: మండలంలోని యర్రగుంట గ్రామంలో లాలూస్వామి పీర్ల మకానం హుండీ ఆదాయాన్ని గురువారం లెక్కించారు. తహసీల్దార్ శ్రీనివాసులు, ఏఎస్ఐ శంకర్‌రెడ్డి ఆధ్వర్యంలో గ్రామ సర్పంచ్ జయరాం చౌదరి, ఎంపీటీసీ సభ్యుడు నరేంద్ర, టీడీపీ నాయకుడు తూర్పు రఘునాథ్ తదితరులు లెక్కించారు. రూ. 5,16,404 ఆదాయం వచ్చినట్లు వారు తెలిపారు. ఇటీవల జరిగిన మొహర్రం వేడుకల్లో భక్తులు హుండీల ద్వారా సమర్పించిన ఆదాయాన్ని లెక్కించినట్లు చెప్పారు.

ఘనంగా క్రీడా దినోత్సవం

ఉరవకొండ, ఆగస్టు 29: పట్టణంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో క్రీడా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా హాకీ క్రీడాకారు డు ధ్యాన్‌చంద్ జయంతిని పురస్కరించుకుని ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కేఎస్ఎన్ డిగ్రీ కళాశాల వైస్ ప్రిన్సిపాల్ మస్తానయ్యఅధ్యాపకురాలు కృష్ణవేణి, పీడీ ప్రశాంత్ విద్యార్థులు పాల్గొన్నారు.

కొనకొండ్ల హైస్కూల్‌కు క్రీడా ప్రతిభా అవార్డు

వజ్రకరూరు మండలం కొనకొండ్ల జిల్లా పరిషత్ హైస్కూల్‌కు క్రీడా ప్రతిభా అవార్డు దక్కింది. జాతీయ క్రీడా దినోత్సవాన్ని పురస్కరించుకుని జిల్లాకేంద్రంలో కలెక్టర్ చేతుల మీదుగా అవార్డును అందుకున్నారు. జాతీయస్థాయి క్రీడా పోటీల్లో ఇద్దరు, రాష్ట్ర స్థాయిలో 25మంది విద్యార్థులు పాల్గొన్నందుకు పాఠశాలకు అవార్డు వచ్చిందని హెచ్‌ఎం వేణుగోపాల్ తెలిపారు. క్రికెట్, సాఫ్ట్ బేస్‌బాల్, సైక్లింగ్ పోటీల్లో ఈ అవార్డులు వచ్చాయన్నారు.

కల్తీ ఎరువులు విక్రయిస్తే చర్యలు

గుంతకల్లు టౌన్, ఆగస్టు 29: ఫర్టిలైజర్స్ దుకాణాల యజమానులు కల్తీ పురుగు మందులు, ఎరువులు విక్రయిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని మండల వ్యవసాయాధికారి కే స్వాతి హెచ్చరించారు. పట్టణంలోని పలు ఫర్టిలైజర్స్ షాపులను గురువారం ఆమె తనిఖీ చేసి రికార్డులు పరిశీలించారు. అనంతరం మాట్లాడుతూ రైతులు మందులు, ఎరువులు కొనుగోలు చేస్తే తప్పనిసరిగా బిల్లు రసీదు తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో వ్యవసాయ శాఖ సిబ్బంది పాల్గొన్నారు.

ఎయిడ్స్‌పై అవగాహన

గుంతకల్లు టౌన్, ఆగస్టు 29: పట్టణంలోని ప్రభుత్వాస్పత్రిలో గురువారం ప్రగతి మైత్రి మహిళా సంఘం ఆధ్వర్యంలో హెచ్ఐవీ, ఎయిడ్స్‌పై అవగాహన సదస్సు జరిగింది. ఆస్పత్రి సూపరింటెండెంట్ రాజేంద్రరావు మాట్లాడు తూ హెచ్ఐవీ ఉన్నవారి పట్ల వివక్ష చూపరాదన్నారు. వ్యాధి నియంత్రణకు ప్రతిఒక్కరూ కృషి చేయాలని సూ చించారు. కార్యక్రమంలో పీపీ యూనిట్ వైద్యులు కల్యాణ్‌చక్రవర్తి, అరుణ, ఐసీటీసీ కౌన్సిలర్లు ప్రసాద్, పీరానాయక్,ప్రగతి మైత్రి మహిళా సంఘం ప్రాజెక్టు డైరెక్టర్ నూర్జహాన్, మేనేజరు రమేష్, ఎంఈ రాధమ్మ, సచివాలయ ఏఎన్ఎం పాల్గొన్నారు.

రేపు పింఛన్ల పంపిణీ

పుట్లూరు, ఆగస్టు 29: మండలంలో ఈనెల 31వ తేదీన శనివారం సామాజిక పింఛన్ల పంపిణీ చేస్తామని ఎంపీడీఓ యోగానందరెడ్డి గురువారం ప్రకటనలో తెలిపారు. మండలవ్యాప్తంగా మొత్తం 5768 పింఛన్లకు గాను రూ.2.55కోట్లు మంజూరైనట్లు చెప్పారు. లబ్ధిదారులకు 110మంది సచివాలయ సిబ్బంది ఇంటింటికీ వెళ్లి పింఛన్లు అందించనున్నారని వెల్లడించారు.

ఘనంగా సామూహిక సీమంతాలు

●పాల్గొన్న ఎమ్మెల్యే బండారు శ్రావణిశ్రీ

యల్లనూరు, ఆగస్టు 29: మండలకేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయంలో గురువారం ఐసీడీఎస్ ఆధ్వర్యంలో గర్భిణులకు సామూహిక సీమంతాలు ఘనంగా జరిగాయి. ఎమ్మెల్యే బండారు శ్రావణిశ్రీ ముఖ్యఅతిథిగా పాల్గొని సుమారు 50 మంది గర్భిణులకు పసుపు, కుంకుమ, చీరలను అందించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రతిగర్భిణీ వైద్యాధికారుల సూచనల మేరకు నడుచుకోవాలని, ప్రభుత్వం ఐసీడీఎస్ ద్వారా అందిస్తున్న పౌష్టికాహారాన్ని తీసుకొని ఆరోగ్యకరమైన బిడ్డకు జన్మనివ్వాలని తెలియజేశారు. సీడీపీఓ భారతి మాట్లాడుతూ గర్భిణులకు ఐసీడీఎస్ ద్వారా అందాల్సిన అన్ని సౌకర్యాలను అందిస్తున్నామని, సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. సూపర్‌వైజర్ రోజా రమణి, వైద్యాధికారి లోకేష్, తహసీల్దార్ నాగరాజు, అంగన్‌వాడీ సిబ్బంది పాల్గొన్నారు.



గర్భిణులకు చీర, సారె పెడుతున్న ఎమ్మెల్యే

పరిశ్రమల ఏర్పాటుకు చర్యలు తీసుకోండి

కళ్యాణదుర్గం, ఆగస్టు 29: మండలంలోని తిమ్మసముద్రం వద్ద ఉన్న ఏపీఐఐసీ భూముల్లో పరిశ్రమల ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలని, అలాగే కళ్యాణదుర్గం నియోజకవర్గానికి అవసరమైన తాగు, సాగునీటిని అందించే భైరవాని తిప్ప ప్రాజెక్టు పనులు పూర్తి చేయాలని కలెక్టర్ వినోద్‌కుమార్‌ను ఎమ్మెల్యే అమిలినేని సురేంద్రబాబు కోరారు. తిమ్మసముద్రం ప్రాంతంలోని ఏపీఐఐసీ భూములను పరిశీలించేందుకు వచ్చిన కలెక్టర్‌ను పట్టణంలోని ఆర్డీవో కార్యాలయంలో గురువారం ఎమ్మెల్యే కలిసి నియోజకవర్గంలో నెలకొన్న సమస్యలను విన్నవించారు. ప్రతి గ్రామానికి సీసీ రోడ్లు, తాగునీటి వసతి కల్పించేందుకు చర్యలు తీసుకోవాలని కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లారు.



కలెక్టర్‌కు సమస్యలు విన్నవిస్తున్న ఎమ్మెల్యే అమిలినేని

వైభవంగా సీతారాముల కల్యాణం

బొమ్మనహాళ్, ఆగస్టు 29: మండలంలోని నేమకల్లు ఆంజనేయస్వామి ఆలయంలో శ్రావణమాసం బ్రహ్మోత్సవాల సందర్భంగా గురువారం సీతారాముల కల్యాణం వైభవంగా నిర్వహించారు. వేకువజామునే ప్రధాన అర్చకులు అనిల్‌కుమార్ చార్యులు, సంతోష్‌కుమార్‌చార్యులు స్వామివారికి సుప్రభాతసేవ, పంచామృతాభిషేకం, అలంకరణలు , ప్రత్యేక పూజలు జరిపారు. నైవేద్యం సమర్పించి మహా మంగళహారతి ఇచ్చారు. అనంతరం సీతారాముల ఉత్సవ మూర్తులను పట్టువస్త్రాలతో అలంకరించి వేదమంత్రాల నడుమ కల్యాణాన్ని జరిపించారు. భక్తులు పెద్దఎత్తున పాల్గొన్నారు. కార్యక్రమంలో ఈఓ నరసింహారెడ్డి, అటెండర్ ఓబన్న, టీడీపీ నాయకులు పాల్గొన్నారు.



సీతారాముల కల్యాణాన్ని జరిపిస్తున్న అర్చకులు

హత్య కేసులో ఇద్దరి అరెస్టు

బెళుగుప్ప,ఆగస్టు 29: మండలంలోని యలగలవంక తండాలో గత మంగళవారం రాత్రి తిప్పేస్వామి నాయక్‌పై దాడి చేసి గొంతు నులిమి చంపిన తల్లి, కొడుకు లక్ష్మీబాయి, రాజశేఖర్ నాయక్‌ను గురువారం అరెస్టు చేసినట్లు సీఐ ప్రవీణ్‌కుమార్ తెలిపారు. మండలకేంద్రంలోని పోలీస్ స్టేషన్‌లో ఆయన ఎస్ఐ శివ, ఏఎస్ఐలు రామదాసు, కుమారస్వామితో కలిసి వివరాలను వెల్లడించారు. గుండ్లపల్లి క్రాస్ వద్ద తల్లీ కొడుకులను అరెస్టు చేశామన్నారు. కుటుంబ కలహాలతోనే ఈ హత్య జరిగినట్లు తమ విచారణలో తేలిందన్నారు. తిప్పేస్వామి నాయక్ తరచూ మద్యం తాగొచ్చి భార్య లక్ష్మీబాయిని వేధిస్తుండేవాడని, అదీగాక అప్పుల విషయమై అతడికి, కుమారుడు రాజశేఖర్ నాయక్ మధ్య గొడవ జరిగిందన్నానరు. ఈ క్రమంలో ఆవేశంతో వారిద్దరూ దాడి చేయడంతో అతడు చనిపోయాడని అన్నారు. మృతుడి కుమార్తె జ్యోతిబాయి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు చెప్పారు.



నిందితుల అరెస్టును చూపుతున్న సీఐ, ఎస్ఐలు

విద్యార్థిని చితకబాదిన ఉపాధ్యాయురాలు

గుత్తి, ఆగస్టు 29: పట్టణంలోని ఓ ప్రైవేట్ పాఠశాలలో గురువారం ఒకటో తరగతి విద్యార్థిని ఉపాధ్యాయురాలు విచక్షణారహితంగా చితకబాదింది. దీంతో ఆ విద్యార్థి తల్లిదండ్రులు స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. పట్టణ శివారులోని జడ్ వీరారెడ్డి కాలనీలో నివాసముంటున్న అశోక్, అనిత దంపతుల కుమారుడు శివసాయి స్థానిక తాడిపత్రి రోడ్డులోని ఓ ప్రైవేట్ ఇంగ్లీష్ మీడియం పాఠశాలలో ఒకటో తరగతి చదువుతున్నాడు. కాగా తరగతి గదిలో ఉపాధ్యాయురాలు భారతి ఆ విద్యార్థి హోంవర్క్ రాయలేదన్న కారణంగా కర్రతో చితకబాదింది. విచక్షరహితంగా కొట్టడంతో వీపు, చేతులపై వాతలు పడ్డాయి. విషయం తెలుసుకున్న తల్లిదండ్రులు ఆగ్రహం వ్యక్తం చేస్తూ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. బాధితుల ఫిర్యాదు మేరకు పోలీసులు దర్యాప్తు చేపట్టారు.



విద్యార్థి వీపుపై వాతలు

వైభవంగా షంషేర్ ఊరేగింపు

ఉరవకొండ, ఆగస్టు 29: పట్టణంలో బీబీజైనబ్బీ దర్గా ఉరుసు ఉత్సవాల్లో భాగంగా షంషేర్ ఊరేగింపును గురువారం రాత్రి వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా తొలుత దర్గాలో అమ్మవారికి ప్రత్యేక ప్రార్థనలు చేశారు. అనంతరం స్థానిక పామిడి బాషా సాబ్ అంగడి నుంచి షంషేర్‌ను బుడేన్‌సాబ్ ఇంటికి చేర్చారు. అక్కడి నుంచి పుర వీధుల గుండా ఊరేగించారు. ఉరుసు ఉత్సవాల్లో జిల్లా నలుమూలల నుంచే కాక కర్ణాటక రా ష్ట్రం నుంచి పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. పోలీసులు బందోబస్తు నిర్వహించారు. కమిటీ సభ్యులు హోతూరు బాషా, బ్యాళ్ల ప్రసాద్, జిలాన్, జాకీర్ తదితరులు పాల్గొన్నారు.



ప్రత్యేక అలంకరణలో అమ్మవారి సమాధి

5 నుంచి నిరవధిక సమ్మె

● సీఐటీయూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఓబులు

అనంతపురం కల్చరల్, ఆగస్టు 29: బకాయి వేతనాలు చెల్లించాలని డిమాండ్ చేస్తూ సత్యసాయి, శ్రీరామిరెడ్డి వాటర్‌వర్క్స్ కార్మికులు సెప్టెంబరు 5వ తేదీ నుంచి నిరవధిక సమ్మె చేపట్టనున్నారని, ఈ సమ్మెకు ప్రజా, కార్మిక సంఘాలు మద్దతుగా నిలువనున్నాయని సీఐటీయూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఓబులు అన్నారు. గురువారం జేవీవీ జిల్లా కార్యాలయంలో నిర్వహించిన రౌండ్‌టేబుల్ సమావేశంలో ఆయన మాట్లాడారు. కార్మికులకు నెలల తరబడి వేతనాలు చెల్లించకుండా ప్రభుత్వాలు జాప్యం చేయడం అన్యాయమన్నారు. కార్మికులకు వెంటనే బకాయి వేతనాలు చెల్లించాలని కోరారు. తాగునీటి మోటార్లకు మీటర్లు బిగించే విధానాన్ని కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిందని, ఈ విధానం వల్ల భవిష్యత్తులో ప్రజలపై తీవ్రమైన భారం పడే ప్రమాదముందన్నారు. కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా అధ్యక్ష కార్యదర్శులు నాగమణి, నాగేంద్రకుమార్, ఐఎఫ్‌టీయూ జిల్లా కార్యదర్శి ఏసురత్నం, ఏజీటీయూసి జిల్లా కార్యనిర్వాహక అధ్యక్షుడు వీకే కృష్ణుడు, ఏపీ రైతుసంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి చంద్రశేఖర్‌రెడ్డి, ఏపీ కౌలురైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి బాలరంగయ్య, గోపాల్, నాగభూషణ తదితరులు పాల్గొన్నారు.